RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 222 శనివారం 6 సెప్టెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హెూం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.

# తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలి: సీఎం రేవంత్‌రెడ్డి




మాదాపూర్: విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నానని చెప్పారు. విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని, తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. "ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి.. అక్కడి విద్యా విధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తాం. దిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణం. నాకూ స్వార్థం ఉంది. టీచర్లు బాగా పని చేస్తే నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నా. మీతోపాటే నేనూ కష్టపడతా. నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటా.. మళ్లీ సీఎంను చేయండి అని అనట్లేదు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. ఐటీఐలు అప్‌డేట్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చాం. ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే నాకే మతిపోయింది. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్.. ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదు. దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటీకి చెందిన వారే 16 స్వర్ణపతకాలు సాధించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి. వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీ అయ్యారు" అని రేవంత్ తెలిపారు. "చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే. జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారు? నేనూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చాను. గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా..? అందులో సీఎం పాల్గొన్నారా? తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్ల సహకారం కావాలి. పిల్లలు ఎక్కువ సమయం టీచర్ల వద్దే ఉంటారు. పిల్లలతో కలిసే టీచర్ల మధ్యాహ్న భోజనం చేయాలి. వర్సిటీలకు వీసీలను నియమించడానికి గత ప్రభుత్వానికి తీరిక లేదు. ప్రస్తుతం ప్రభుత్వం, టీచర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రైవేట్ స్కూళ్ల టీచర్ల కంటే.. ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం ఎక్కువ. వివాదాస్పదమైన విద్యాశాఖ తీసుకోవద్దని నాకు కొందరు సూచించారు. అయినా వినకుండా ఈ శాఖను నా వద్దే ఉంచుకున్నా"అని రేవంత్‌రెడ్డి అన్నారు.




## ఫలించిన ప్రభుత్వ ప్రయత్నం.. తెలంగాణకు యూరియా రాక..

హైదరాబాద్: తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వం చెప్పిన గుడ్ న్యూస్‌తో ఎట్టకేలకు రైతలకు యూరియా కష్టాలు తీరనున్నట్లు కనిపిస్తున్నాయి. యూరియాపై ప్రభుత్వం చేసిని కసరత్తుకు ప్రతిఫలంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి యూరియాను సరఫరా చేసింది. ఇవాళ(శుక్రవారం) రాష్ట్రానికి 11, 181 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు.. యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లు ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 20 రోజులు.. రోజుకు 10,000 మెట్రిక్ టన్నుల చొప్పున రాష్ట్రానికి సరఫరా చేయాల్సిందిగా కేంద్రాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. రేపు మరో 9039 మెట్రిక్ టన్నులు యూరియా వస్తుందని పేర్కొన్నారు. RFCL మూత పడటంతో కేంద్రం దేశీయ తయారీ యూనిట్ల నుంచి కూడా అదనంగా 30,000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించడానికి కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు.

# గణపతి మహా నిమజ్జనానికి వేళాయె...

## భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన అధికార గణం! - ట్రాఫిక్ రూట్స్ ఛేంజ్ !

హైదరాబాద్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తి శ్రద్ధలతో గణపతి బప్పాను ఆరాధిస్తూ పూజలు, ఊరేగింపులు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఈ ఉత్సవాలకు విశేషమైన స్పందన లభిస్తోంది. పెద్ద ఎత్తున గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసి అంతే వైభవంగా ముగింపు ఘట్టమైన నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున పర్యావరణ హిత నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 10 బేబీ పాండ్లు, 8 పోర్టబుల్ వాటర్ ట్యాంకులు, 8 ఎక్స్కవేషన్ పాండ్లు సిద్ధం చేశారు. ఏదైనా సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు 040-27852482, 8712660600, 9010203626 నంబర్లను సంప్రదించవచ్చు. ఇప్పటికే నిమజ్జన కార్యక్రమాలు జరుగుతూ ఉండగా.. ఈ క్రమంలోనే హైదరాబాద్ మహానగరంలో పోలీసులు సెప్టెంబరు 6, 7 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉందనున్నట్టు ప్రకటించారు. శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు.. అదే సమయంలో సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీసులు వెల్లడించారు. నగరవాసులు పోలీసులకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరుతున్నారు.

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి గణేశ విగ్రహాలను హుస్సేన్ సాగర్ మరియు ఎన్టీఆర్ మార్గ్ వైపు తరలించనున్నారు. బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర బాలాపూర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట, చార్మినార్, అబిడ్స్, లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ్ చేరుతుంది. సికింద్రాబాద్ ప్రాంతం నుంచి వచ్చే విగ్రహాలు పాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ మీదుగా ట్యాంక్‌బండ్ వైపు సాగుతాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం, లక్డీకాపూల్ ప్రాంతాల విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుతాయి. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలను ఎంజే మార్కెట్ వరకే అనుమతిస్తారు. ఈ ప్రధాన మార్గాల్లో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు.



**సౌత్ ఈస్ట్ జోన్:** కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఇతర మార్గాలకు పంపిస్తారు. సెంట్రల్ ప్రాంతాలు: అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, శివాజీ బ్రిడ్జ్, పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, వైఎంసిఏ వద్ద కఠిన నియంత్రణలు అమల్లోకి వస్తాయి. ముఖ్య జంక్షన్లు: లిబర్టీ, అబిడ్స్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ జంక్షన్లను పూర్తిగా మూసివేస్తారు. నార్త్ జోన్: పాట్నీ, పారడైజ్, రాణిగంజ్ చౌరస్తాలలో ట్రాఫిక్‌ను వేరే మార్గాలకు మళ్లిస్తారు. పార్కింగ్ సదుపాయాలు నిమజ్జనం వీక్షించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం కట్టమైసమ్మ దేవాలయం పబ్లిక్ గార్డెన్స్ బుద్ధభవన్ వెనుక ఆదర్శనగర్ బీఆర్‌కే భవన్ ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ ఈ ప్రదేశాల్లో వాహనాలు పార్క్ చేసుకునే అవకాశం ఉంటుంది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మాత్రమే ఉపయోగించాలని పోలీసులు సూచించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలనుకునేవారు బేగంపేట, పారడైజ్ మార్గాన్ని ఎంచుకోవడం మంచిదని సూచించారు. భారీ వాహనాలు కేవలం ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మాత్రమే ప్రయాణించాలన్నారు.

# ట్రంప్ సుంకాల షాకులు....

# అమెరికన్లకు వాతలు...




# భారీ మూల్యం చెల్లించక తప్పదు!

వెనకటికి ఒక మూరు?డు తాను కూర్చున్న చెట్టు కొమ్మను కోస్తూ.. తనకు మించిన తెలివైనోడు లేడని మురిసిపోయాడట. కాసేపటి తర్వాతేం జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు కూడా ఇప్పుడు అలానే ఉంది. ప్రపంచ దేశాలు తమ కంపెనీల మీద భారీ పన్నులు వేస్తున్నాయన్న మాటలు చెప్పి.. ఇష్టారాజ్యంగా సుంకాల షాకులు ఇస్తున్న సంగతి తెలిసిందే. పిచ్చోడి చేతిలో రాయి మాదిరి.. ఒక పద్ధతి పాడు లేకుండా.. పక్కా వ్యూహం లేకుండా తన చిట్టి మనసుకు తోచినట్లుగా వ్యవహరిస్తున్న ఆయన తీరుతో ప్రపంచంలోని పలు దేశాలు హాహాకారాలు చేస్తున్న పరిస్థితి. ట్రంప్ ముందు వరకు ప్రపంచం ఎదుర్కొన్న పరిణామాలకు భిన్నంగా ఆయన అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో తెలిసిందే. గడిచిన రెండు.. మూడు నెలలుగా కొన్ని దేశాల మీద కత్తి కట్టి వారిపై సుంకాల షాకులు ఇస్తూ.. దాని కారణంగా అమెరికన్ల బతుకుల్ని.. అమెరికా దేశాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళుతున్నట్లుగా ఆయన చెబుతున్న మాటలు అన్ని ఇన్ని కావు. నిజంగానే.. ఆయన చెబుతున్నట్లు పలు దేశాల మీద విధిస్తున్న సుంకాల కారణంగా ఆయా దేశాల నుంచి పెద్ద ఎత్తున ఆదాయం ట్రంప్ ఖజానాకు చేరుతుందని చెప్పే వాదనలో నిజం ఎంత? అన్నది ప్రశ్న. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఒక్క ఆగస్టు నెలలోనే ప్రపంచంలోని పలు దేశాల మీద విధించిన సుంకాల షాకుల కారణంగా అమెరికా ఖజానాకు చేరిన సంపద 31 బిలియన్ డాలర్లుగా చెబుతున్నారు. భారత రూపాయిల్లో చెప్పాలంటే ఇది రూ.2.73 లక్షల కోట్లు. నెలలో ఇంత భారీ ఆదాయం రావటం ఇదే తొలిసారి కావటం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు) ఇప్పటివరకు 158 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నట్లు చెబుతున్నారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే తాజా ఆదాయం రెండున్నర రెట్లు ఎక్కువని చెప్పాలి. వివిధ దేశాల మీద సుంకాలు విధించిన తర్వాత అమెరికా ఆదాయం క్రమంగా పెరుగుతున్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ లో 17.4 బిలియన్ డాలర్ల ఆదాయం రాగా.. మేలో అది కాస్తా 23.9 బిలియన్ డాలర్లకు పెరిగింది. జూన్ లో 28 బిలియన్ డాలర్లు అయితే.. జులై నాటికి 29 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. ఇక.. ఆగస్టులో రికార్డు స్థాయిలో 31 బిలియన్ డాలర్లుగా వైట్ హౌస్ వెల్లడించింది. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. గత ఏడాదిలో వచ్చిన ఆదాయం మొత్తం.. ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఐదు నెలల్లోనే అగ్రరాజ్యం గడించింది. భారీ స్థాయిలో విధించిన సుంకాల్ని ట్రంప్ సమర్థించటం ద్వారా అమెరికా ఖజానాకు భారీ ఆదాయాన్ని సమకూర్చిపెట్టినట్లుగా ఆయన చెప్పుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఆదాయం బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు అయ్యే ఖర్చును భర్తీ చేస్తుందని ట్రంప్ వర్గీయులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడో మరో వాదన బలంగా వినిపిస్తోంది. అదేమంటే.. వివిధ దేశాల మీద విధించిన సుంకాలకు సంబంధించిన అసలు షాకులు ఆయా దేశాల మీద కంటే కూడా అమెరికన్ల మీదనే ఎక్కువగా ఉందం టున్నారు. అదెలానంటే.. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల మీద విధిస్తున్న సుంకాల మొత్తం అమెరికాలోని ప్రజల మీద నేరుగా ప్రభావాన్ని చూపుతుందంటున్నారు. విదేశాల మీద వచ్చే వస్తువుల మీద విధించే ఎగుమతి సుంకం నేరుగా అమెరికా ఖజానాకు చేరుతుంది. అదేసమయంలో సుంకాల షాకుల కారణంగా అమెరికాకు వచ్చే విదేశీ వస్తువులు.. వస్తు సేవల ధరలు భారీగా పెరుగుతాయి. ఇక్కడో ఉదాహరణ చెబితే విషయం మరింత తేలిగ్గా అర్థమవుతుంది. చైనాలో తయారైన ఒక ఏసీ మీద 25 శాతం సుంకం విధిస్తే.. అదే ఏసీని అమెరికన్ కొన్నపక్షంలో.. ట్రంప్ సుంకాల కారణం గా ఏసీ ధర పెరిగి.. అంతిమంగా అమెరికన్ జేబుకు చిల్లుపెడుతుంది. ఆర్థికవేత్తలు కూడా ఇదే విషయాన్ని చెబుతూ.. ట్రంప్ విధిస్తున్న సుంకాలు వివిధ దేశాలకు భారం సంగతి పక్కన పెడితే.. సొంత దేశస్తుల మీదా భారీ ఖర్చుకు కారణమవుతున్నట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ సందర్భంగా చరిత్రను గుర్తు చేస్తున్నారు. 2018-19 మధ్య కాలంలో అమెరికా - చైనా మధ్య ట్రేడ్ వార్ జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అప్పట్లో ఈ రెండు దేశాల మధ్య మొదలైన ట్రేడ్ వార్ పుణ్యమా అని ఒక్క చైనా నుంచి దిగుమతులపై వసూలైన మొత్తం అప్పట్లో 23 బిలియన్ డాలర్లు. దీని కారణంగా దిగుమతుల ధరలు పెరిగి అమెరికన్ల మీద పడిన భారాన్ని ప్రస్తావిస్తూ.. ఒక అధ్యయనం ప్రకారం అప్పట్లో ఒక్కో అమెరికన్ కుటుంబం మీద కనిష్టంగా 400 డాలర్లు.. గరిష్ఠంగా 800 డాలర్ల భారం పడినట్లు చెబుతారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఏర్పడుతుందని చెబుతున్నారు. సుంకాల కారణంగా వస్తువుల ధరలు పడి.. వాటికి ఎక్కువ ధరలు చెల్లించాల్సింది అమెరికన్ ప్రజలేనని మర్చిపోకూడదు. దీంతో.. సుంకాల కారణంగా ఎగుమతులు చేసిన దేశాల మీదే కాదు అమెరికా ప్రజల మీద కూడా ప్రభావాన్ని చూపుతుంది. సుంకాల కారణంగా ఇప్పటికే ప్యాక్డ్ ఫుడ్ మీద 0.5 శాతం నుంచి 2 శాతం మేర.. వస్త్రాల మీద 3 శాతం నుంచి 12 శాతం.. ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్ మీద ఒక శాతం నుంచి ఆరు శాతం వరకు.. హెూం అప్లయన్స్ మీద 5 శాతం వరకు అదనపు భారం పడిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ట్రంప్ సుంకాల షాక్ సంగతేమో కానీ.. అమెరికా ప్రజలు భారీ మూల్యాన్ని చెల్లించక తప్పట్లేదు.

# సంపాదకీయం

## మోడీ సర్కార్ కరుణ వెనక ట్రంప్ ఉన్నారా ?

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం పట్ల విపక్షాలు సైతం స్వాగతిస్తూ మాట్లాడుతున్నాయి. జీఎస్టీ పన్నుల విధానంలో సంస్కరణలను తీసుకుని రావడం ద్వారా పేదలు మధ్యతరగతి వర్గాలకు మోడీ ప్రభుత్వం చాలా వరకూ ఊరటను ఇచ్చింది. ముఖ్యంగా అతి పెద్ద వరంగా ఆరోగ్య భీమా ఉంది. ఇది ఇపుడు అందరికీ అవసరం కూడా. దీని మీద జీఎస్టీ విధింపు జీరో చేయడంతో దేశమంతా హర్షం వ్యక్తం అవుతోంది. గతంలో 18 శాతం ఉన్న దానికి ఏకంగా జీరోకు తెచ్చారు. అలాగే హెల్త్ కేర్ కి సంబంధించి ఉన్న 12 శాతం స్లాబ్ ని 5 శాతం స్లాబ్ లోకి చేర్చడం మంచి పరిణామం అని అంటున్నారు.

**అందరికీ మేలుగానే :** ఇక ఆహార సామాగ్రితో పాటు టెక్స్ టైల్స్ రంగంలో కూడా 12 శాతంగా ఉన్న జీఎస్టీ స్లాబ్ ని 5 శాతానికి తెచ్చారు. సిమెంట్ ధరల విషయంలో విశేష ప్రభావం చూపేలా 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించడం వల్ల మాధ్యతరగతి వర్గాలు గృహ నిర్మాణం పనులు సులువుగా చేసుకునేందుకు వీలు కలుగుతుంది అని అంటున్నారు. ఇక రైతులకు మేలు చేసేలా వ్యవసాయ పరికరాల మీద ఉన్న 18 శాతం జీఎస్టీ స్లాబ్ ని 5 శాతానికి చేర్చారు. అలాగే ఇతర కేటగిరీల విషయంలో స్లాబ్ ని తగ్గించడం వల్ల భారీ ఊరట కలుగుతుంది అని అంటున్నారు.

**బీహార్ భయమా :** అయితే ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం తమ ఉదారత చూపించడానికి బీహార్ ఎన్నికలు కారణమా అన్న చర్చ సాగుతోంది. బీహార్ లో ఈసారి గట్టి పోటీ ఉండబోతోంది అని అంటున్నారు. అంతే కాదు ఇండియా కూటమి రాహుల్ తాజాగా నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రతో బాగా పుంజుకుంది అని అంటున్నారు. అదే విధంగా యాంటీ ఇంకెంబెన్సీ ఎన్డీయే ప్రభుత్వం మీద హెచ్చుగా ఉండబోతోంది అని కూడా అంటున్నారు. దాంతో బీహార్ ఎన్నికల ముందు ఈ భారీ ఉపశమనం అన్నది ఒక విధంగా వ్యూహాత్మకమా అన్న చర్చ కూడా వస్తోంది అంటున్నారు.

**ట్రంప్ చేసిన మేలుగా :** మరో వైపు చూస్తే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన మేలుగానూ చెబుతున్నారు. భారీ ఎత్తున ట్రారిఫ్ లను విధించి ఇండియాను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో దేశీయ మార్కెట్ ఎకానమీని కాపాడుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోంది అని అంటున్నారు. దీని వల్ల రానున్న రోజులలో ఆర్థికంగా కొంత రిలీఫ్ లభిస్తుంది అని అంటున్నారు. ఇలా బహుముఖీయమైన కారణాలు కూడా ఈ భారీ ఊరట వెనక ఉన్నాయని చెబుతున్నారు.

**కాంగ్రెస్ కామెంట్స్ :** ఇక ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ అయితే జీఎస్టీ స్లాబుల తగ్గింపుల పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే తనదైన శైలిలో మోడీ ప్రభుత్వం మీద విమర్శలు చేసింది. గత ఎనిమిదేళ్లుగా భారీ స్లాబులతో ప్రజలను ఇబ్బంది పెట్టారు అని అంటోంది. ట్రంప్ ప్రభావం బీహార్ ఎన్నికల వల్లనే ఈ విధంగా కేంద్రం చర్యలకు దిగింది అని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం వ్యాఖ్యానించారు. నిజంగా కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే కనుక తాము ఏనాటి నుంచో కోరుతున్నట్లుగా ఇంతకు ముందే ఎందుకు నిర్ణయం తీసుకోలేదని కూడా ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద చూస్తే ప్రతీ ప్రతికూలత తరువాత అనుకూలత ఉంటుంది అని అంటారు. ఆ విధంగానే ఇపుడు ట్రంప్ ప్రభావమో ఎన్నికల మహిమో తెలియదు కానీ దేశంలోని పేదలకు మధ్యతరగతి వర్గాలకు మంచి రోజులే వచ్చాయని అంతా అంటున్నారు. అయితే ఎన్డీయే నేతలు మాత్రం పేదల కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అందుకే తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతోంది. ఏది ఏమైనా సామాన్యుడికి కొంత నిలదొక్కుకునే చాన్స్ అయితే ఈ జీఎస్టీ సంస్కరణలు ఇచ్చాయని అంటున్నారు.

## చెంతనే జలం.. అదనపు ఆయకట్టుకు బలం



అశ్వాపురం : మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ కాంక్రీట్ పనులు కొనసాగుతున్నాయి. రూ.25కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. 2023లో శంకుస్థాపన చేయగా.. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. తుమ్మలచెరువుకు గోదావరి జలాల పంపిణీతో పాటు సీతారామ ప్రాజెక్ట్ పరిధిలోని 16,500 ఎకరాల అదనపు ఆయకట్టును స్థిరీకరించడమే దీని లక్ష్యం. స్థానికంగా అందించకుండా వేరే ఎక్కడికో గోదావరి జలాలను తరలించడం సరైంది కాదనే ఈ ప్రాంత రైతుల భావనలను కూడా ఈ పథకం దూరం చేయనుంది.

**ఏడు నెలల పాటు తవ్వకాలే..**

భీమునిగుండం కొత్తూరు గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్-1 పంప్‌హౌస్ దిగువన ఫోర్ బే వద్ద ప్రధాన కాలువపై ఈ పంప్‌హౌస్ రాఫ్ట్ నిర్మాణం కొనసాగుతోంది. ఏడు నెలల పాటు దీని పునాదుల తవ్వకాలే కొనసాగాయి. గట్టి రాయి పడటంతో పాటు మే నెలలో భారీ వర్షాలు తదితర కారణాల నేపథ్యంలో జాప్యం జరిగింది. ప్రధాన కాలువలో ఇక్కడ నీటిమట్టం 43 అడుగులు ఉంటుందనేది అంచనా. పంప్‌హౌస్ ద్వారా 85 అడుగుల ఎత్తు వరకు ఎత్తిపోయనున్నారు. 1.8 మెగావాట్ల రెండు విద్యుత్తు మోటార్లు, 2.5 క్యూమెక్స్‌ల సామర్థ్యం కలిగిన రెండు పంప్‌లు ఏర్పాటు చేయనున్నారు. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి పైన భూమి ఉపరితలం వరకు ఈ పంప్‌హౌస్ రాఫ్ట్ 30 నుంచి 35 అడుగుల ఎత్తు ఉంటుంది. వీటికి సంబంధించిన పనులే ఇప్పుడు కొనసాగుతున్నాయి. ఎత్తిపోతల పథకంలోని కీలకమైన భాగం ఇదే.

**రెండు కిలోమీటర్ల దూరంలో..**

పంప్‌హౌస్ నుంచి 2 కిలోమీటర్ల దూరంలో గొందిగూడెం ఇసుకవాగు ఉంటుంది. అక్కడి వరకు పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుంది. ఇసుక వాగు సమీపంలో 90 మీటర్ల వద్ద ఎలివేషన్ పాయింట్ ఉంటుంది. ఇక్కడ ఎడమ, కుడి కాలువలు ఉంటాయి. ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఇసుక వాగులోకి వెళ్తాయి. తర్వాత దాని ద్వారా తుమ్మలచెరువులోకి చేరుతాయి. పునాదుల తవ్వకం పూర్తయి కాంక్రీట్ పనులు ప్రారంభమయ్యాయి. విద్యుత్తు మోటార్లు, పంప్‌ల ఏర్పాటు కీలకం. మిగిలిన పనులు త్వరగానే పూర్తవుతాయి. డిసెంబరులోగా తుమ్మలచెరువుకు గోదావరి జలాలను అందజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. – డి.శ్రీనివాస్, డీఈ, సీతారామ ప్రాజెక్ట్

## ఆయుకట్టు.. కళకళ



ఖమ్మం : జిల్లాలో వరినాట్లు ఊపందుకున్నాయి. జులై ఆరంభంలో వర్షాలు సక్రమంగా కురవకపోవటంతో బోర్లు, బావుల కింద వెదజల్లే, నాటు పద్ధతిలో సాగు చేపట్టారు. సాగర్ కాల్వ ద్వారా కృష్ణాజలాలు విడుదలవటంతో ఆయకట్టు పరిధిలో రైతులు సన్నాహాలు ముమ్మరం చేశారు. రెండు వారాల్లో వరినాట్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

**వరి నాట్లు ముమ్మరం..**

జిల్లాలో ఈఏడాది వానాకాలంలో సుమారు 2.95 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 1,98,949 (వెదజల్లే పద్ధతిలో 58,643 నాటు పద్ధతిలో 1,40,306) ఎకరాల్లో సాగైంది. మే మాసంలో వర్షాలు భారీగా కురవటంతో ఎక్కువ మంది రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. జూన్‌లో ఆశించిన స్థాయిలో వానలు పడకపోవటంతో బోర్లు, బావులున్న అన్నదాతలు వెదజల్లే పద్ధతిపై దృష్టిసారించారు. సత్తుపల్లి, వైరా, కూసుమంచి వ్యవసాయ డివిజన్ల పరిధిలో గతంలో కంటే ఎక్కువ మంది వెదజల్లే పద్ధతిని అవలంబించారు.

ఈసారి జులైలో సగటుకు మించి వానలు కురిశాయి. అదే నెల 14న పాలేరు జలాశయం నుంచి ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేశారు. సాగర్ గేట్లు ఎత్తాక నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచటంతో ఆయకట్టుకు జలకళ వచ్చింది. వరినాట్లు ముమ్మరమయ్యాయి. ప్రస్తుతం పాలేరు జలాశయానికి 4వేల క్యూసెక్కుల కృష్ణాజలాలు వస్తుండగా.. అంతే మొత్తాన్ని ప్రధాన కాల్వకు వదలుతున్నారు. అవసరమైతే 8వేల క్యూసెక్కుల వరకు పెంచే అవకాశం ఉంది. 'ఎండల తీవ్రత అధికంగా ఉంది. అడుగున తేమ లేని ప్రాంతాల్లో రైతులు యూరియా బదులు నానో యూరియా పిచికారీ చేసుకోవాలి' అని డీఏఓ పుల్లయ్య సూచించారు. ముందస్తుగా వానలు కురవటంతో జూన్ మొదటి వారంలో వెదజల్లే పద్ధతిలో ఐదెకరాల్లో సాగు పనులు ప్రారంభించాం. తరువాత మండుటెండలు కాయటంతో ఒక ఎకరంలో విత్తనాలు మొలకెత్తలేదు. ప్రభుత్వం గోదావరి జలాలు అందించటంతో ఆ ఎకరంలో నాటు వేశాం. ఇప్పుడు కృష్ణాజలాలు వస్తుండటంతో ఈ సీజన్‌లో మా పంటలకు ఢోకాలేదు. నవంబరులో వచ్చే తుపాన్ల కంటే ముందుగానే పంటలు చేతికందుతాయి. మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం.– పువ్వాళ్ల రామారావు, ఎర్రబోయినపల్లి, కల్లూరు మండలం

## సేవలు ఉచితం.. పర్యవేక్షిస్తేనే ప్రయోజనం




ఖమ్మం : తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం(టీహబ్) సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా లభిస్తున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం సర్వజనాసుపత్రుల్లోని కేంద్రాలకు 134 రకాల పరీక్షలు చేసే సామర్థ్యం కలదు. ప్రస్తుతం 120 రకాల వరకు చేస్తున్నారు. రక్తపరీక్షలు, బయోకెమిస్ట్రీ, హిస్టోపాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల్లో పరీక్షలు జరిపేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటంతో 2024తో పోల్చితే 2025లో రోగులు, నమూనాల సేకరణ, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 2024లో జనవరి నుంచి జులై వరకు 1,13,405 మంది రోగుల నుంచి 2,15,807 నమూనాలు సేకరించి 4,14,674 రకాల పరీక్షలు చేశారు. ఈ ఏడాదిలో 20 శాతానికి పైగా నమూనాలు తగ్గటం గమనార్హం.

**తగ్గుదలకు కారణాలు..**

టీహబ్‌లో పరీక్షల నిర్వహణకు తరచూ ఆటంకం కలుగుతోంది. పరీక్షలకు అవసరమైన రీఏజెంట్ల సరఫరాలో జాప్యం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎంఐడీసీ) వీటిని సరఫరా చేస్తుంది. యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి మరమ్మతులు చేపట్టడానికి స్థానికంగా నిపుణులు లేకపోవటం సమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలామందికి స్మార్ట్ ఫోన్లు ఉండకపోవటంతో పరీక్షల నివేదికలు సత్వరం అందటం లేదు. నేరుగా కొత్తగూడెం సర్వజనాసుపత్రికి వెళ్లినా సిబ్బంది సకాలంలో రిపోర్టులు ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రాల నుంచి రక్తనమూనాలను టీహబ్‌కు చేర్చే వాహనాలు కొన్ని సందర్భాల్లో ఆగిపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో రోగులు ప్రైవేటు ప్రయోగశాలలు లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. 'వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఏ రోజుకు ఆరోజు నివేదికలు పంపిస్తున్నాం. అడపాదడపా సమస్యలు ఉత్పన్నమైనా వాటిని పరిష్కరిస్తున్నాం' అని కొత్తగూడెం టీహబ్ ఇన్‌ఛార్జి నజీరుద్దీన్‌కు తెలిపారు.

**ఆసుపత్రుల నుంచి సేకరణ**

ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక, పట్టణ, బస్తీదవాఖానాలతో పాటు సర్వజనాసుపత్రి, ఈహెచ్‌ఎస్ క్లీనిక్‌ల్లో చికిత్సలు పొందే రోగులకు చెందిన రక్తనమూనాలకు టీహబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 48 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల నుంచి రోజూ నమూనాలు సేకరిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 29 పీహెచ్‌సీల పరిధి నుంచి రక్తనమూనాలు కొత్తగూడెంలోని టీహబ్‌కు చేరుతున్నాయి.

## భూసార పరీక్షలు కరీంనగర్‌లోనే!

వేములవాడ : జిల్లాలోని రైతులకు భూసార పరీక్షల ఫలితాలు అందటంలో ఆలస్యం జరుగుతోంది. వేములవాడలోని భూసార పరీక్ష కేంద్రం మూతపడటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా రైతులకు అందుబాటులో ఉండేలా వేములవాడలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 1998లో భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడక ముందు సిరిసిల్ల, వేములవాడ, చందుర్తి, కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల రైతులకు భూసార పరీక్షల సేవలు ఈ కేంద్రం నుంచి అందేవి. కేంద్రంలోని ఏవో, సిబ్బంది బదిలీలపై వెళ్లడంతో తిరిగి నియమించలేదు. దీంతో పన్నెండేళ్ల క్రితం మూతబడిన కేంద్రం తిరిగి వినియోగంలోకి రావటం లేదు.

**మూలనపడ్డ కిట్లు** కేంద్రం మూతపడటంతో అందులోని పరీక్ష సామగ్రి తుప్పుపట్టి పనికి రాకుండా పోయాయి. పదేళ్ల క్రితం భూసార పరీక్షలకు అవసరమైన దాదాపు రూ.5లక్షల విలువ గల పరికరాలను ప్రభుత్వం అందజేసింది. ఇప్పటి వరకు అవి అట్టపెట్టెల్లోనే మూలుగుతున్నాయి. ఎందుకు పనికిరాకుండా పాడై పోయాయి. జిల్లాలోని రైతులకు సంబంధించిన భూముల మట్టి నమూనాలు సేకరించిన వ్యవసాయ



అధికారులు కరీంనగర్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏకైన భూసార పరీక్ష కేంద్రం కరీంనగర్‌లోనే ఉండటంతో రైతులందరికీ సంబంధించిన మట్టి నమూనాలు ఆ కేంద్రానికే పంపించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అక్కడ పరీక్షలు ఆలస్యం కావటంతో రైతులకు సకాలంలో ఫలితాలు అందని ద్రాక్షగా మారాయి. క్లస్టర్ల వారీగా ప్రభుత్వం ఇచ్చిన భూసార పరీక్ష కిట్లు ఎప్పుడో మూలన పడ్డాయి.

**రైతులకు నష్టం**

భూసార పరీక్షలతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. పంట క్షేత్రాల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్ష చేయించిన తరువాత వచ్చే ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది. పరీక్షలతో మట్టిలో ఎంత మోతాదులో భాస్వరం, నత్రజని, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు ఉన్నాయనే విషయం వెల్లడవుతోంది. ఆ ఫలితాలను భూముల్లో పంటల మార్పు, సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఫలితాల జాప్యంతో రైతులు నష్టపోతున్నారు. చేసేందేం లేక ఏదో ఒక పంట వేస్తున్నారు. ఇప్పటికైనా భూసార పరీక్ష కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదిక పంపాం– సాయికిరణ్, ఏఈవో, వేములవాడ**

వేములవాడలోని భూసార పరీక్ష కేంద్రం పనిచేయాలంటే ఒక ఏవో, సిబ్బంది అవసరం ఉంటుంది. పరికరాలు అందుబాటులో ఉన్నాయి. సిబ్బందిని నియమించి కేంద్రాన్ని ప్రారంభించాల్సిందిగా ప్రభుత్వానికి నివేదిక పంపాం.

## గుర్తించు.. మోసాలకు చెక్ పెట్టు

పెద్దపల్లి : సుల్తానాబాద్‌లోని ఓ సినిమా థియేటర్‌లో పలు ప్యాకింగ్ తినుబండారాలపై తయారీ తేదీ, ఎమ్మార్పీ లేకపోవడంపై వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తూనికల, కొలతల అధికారులు కేసు నమోదు చేశారు. రామగిరి నాగేపల్లి ఐకేపీ కేంద్రంలో 41 కిలోల కంటే ఎక్కువ పరిమాణంలో ధాన్యం బస్తా తూకం వేయడంతో కేసు నమోదు చేసి రూ.25 వేల జరిమానా విధించారు. దుకాణాలు, బేకరీలు, హోటళ్లు ఇతర తినుబండారాలతోపాటు అన్ని రకాల ప్యాకేజీ ఉత్పత్తులలో వినియోగదారులకు జరుగుతున్న మోసాలను నియంత్రించేందుకు తూనికలు, కొలతల అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. అయినా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన లేకపోవడంతో పలు చోట్ల పలు రకాలుగా తూకాల్లో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. వినియోగదారుడు నష్టపోతూనే ఉన్నారు.

**ఆయా చోట్ల ఇలా..**

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారులు 85 కేసులు నమోదు చేసి రూ.3.17 లక్షలు జరిమానాలు వసూలు చేశారు. కిరాణ వీధి దుకాణాలు మినహా సరకులను విడిగా విక్రయించే పద్ధతి పోయింది. గ్రామస్థాయిలో కూడా సూపర్ మార్కెట్‌ల సంస్కృతి విస్తరించడంతో అందమైన ప్యాకెట్లతో సరకులను విక్రయిస్తున్నారు. వీటిపై తయారీదారుడి వివరాలు, ఎమ్మార్పీ, బరువు, తయారీ తేదీ, గడువు తేదీలను విడివిడిగా ముద్రించాలి. కానీ అవేవీ ఉండటం లేదు. పెట్రోల్‌బంకుల్లో మోసాలు జరుగుతున్నాయి. మీటర్ రీడింగ్ ట్యాంపరింగ్ చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. అనుమానం వచ్చినప్పుడు అక్కడి సిబ్బంది ద్వారా పరీక్షించుకోవచ్చు.



హొటళ్లలో కొనుగోలు చేసే స్వీట్లు, బ్రెడ్డు ప్యాకెట్లపై బరువు, గడువు తేదీ ఉండటం లేదు.

వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు నిత్యం తనిఖీలు, ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోవడం ద్వారా వీటికి అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.

**గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ**

– విశ్వేశ్వర్, జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్

గత ఏప్రిల్ నుంచి జులై వరకు జిల్లాలో వివిధ కేసుల్లో రూ.3.17 లక్షల జరిమానా విధించాం. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండటం, ప్యాకింగ్ నిబంధనలు తెలియకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎమ్మార్పీని తొలగించి, స్టిక్కర్లు అతికించి అధిక ధరలకు విక్రయించడంలాంటివి చేస్తున్నారు. ఇలా చేయడం నేరం. ఆయా సందర్భాల్లో ఫిర్యాదు చేస్తే స్పందించి వారిపై కేసులు నమోదు చేస్తాం.

# రుణాలకు కొత్త మెలిక

ఖమ్మం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు లింకేజీ విషయంలో బ్యాంకర్లు కొత్త మెలిక పెట్టాయి. రుణం తీసుకునే ప్రతి మహిళ 'ఉద్యమ్ ఆధార్' తప్పనిసరిగా కలిగా ఉండాలని చెప్పడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ అందరితో పూర్తి చేయాలంటే సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేవారు తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు 'ఉద్యమ్ ఆధార్'ను తప్పనిసరిగా తీసుకోవాలని బ్యాంకర్లు చెబుతుంటారు. దీన్ని ప్రభుత్వ రుణంతో స్వయం ఉపాధి పొందే సంఘాలకూ వర్తింపజేస్తున్నారు. సంఘం తరఫున కనిష్ఠంగా రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.20లక్షల వరకు రుణాలు తీసుకునే వారందరూ ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకోవాలని చెప్పడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

**ఇబ్బందేంటి?**

ఉద్యమ్ ఆధార్ తీసుకోవాలంటే పాన్‌కార్డు, ఆధార్ కార్డు రెండూ ఉండాలి. పాన్, ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానమై ఉండాలి. రుణం



తీసుకునేవారు ఏదో ఒక వ్యాపారం నడుపుతున్నట్టుగా ట్రేడ్ లైసెన్స్ లాంటి పత్రాలను తీసుకోవాలి. ఇవన్నీ ఉంటేనే ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకోవచ్చు. ఉభయ జిల్లాల్లో చాలామందికి పాన్ ఉన్నా ఆధార్‌తో అనుసంధానం కాలేదు. ఇప్పటికిప్పుడు చేయించుకోవాలన్నా కనిష్ఠంగా 15 రోజులు పడుతుంది. రూ.1100 వరకు ఖర్చు అవుతుంది. రెండు కార్డుల్లో పేర్లలో చిన్న లోపాలున్నా మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇదంతా మెప్మా సభ్యులకు భారంగా మారుతుంది. దీంతో రుణాలపై ఆసక్తి చూపేందుకు అవకాశం లేకుండా పోతుందన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. ఖమ్మం జిలాల్లో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను మెప్మా పరిధిలో ఉన్న 7640 సంఘాల్లో 1220 సంఘాలకు రూ.205.64 కోట్లతో రుణాలు ఇవ్వాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రతిపాదనలు చేసింది. ఏడు దివ్యాంగ సంఘాలకు రూ.23లక్షలు, 10 వీధి వ్యాపారుల సంఘాలకు రూ.28లక్షలు రుణాలు కేటాయించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలు తీసుకునే ప్రతి సభ్యులు ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా పొందాలి.

ఒక్క ఖమ్మం జిల్లాలో చూసినట్టయితే మెప్మా పరిధిలోని 70వేల మంది మహిళలు ఉద్యమ్ ఆధార్ పొందాల్సి ఉంది. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా ఇప్పటికే నూతన విధానానికి సంబంధించి కొంతమంది ఆర్పీలకు శిక్షణ ఇచ్చామని, వారి ద్వారానే నమోదు చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రాద్రి జిల్లాలో చూసినట్లయితే 3,369 మెప్మా సంఘాలున్నాయి.

# 'సూపర్ స్పెషాలిటీ' సేవలు అందని ద్రాక్షేనా..?

నిజామాబాద్ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సేవలు ప్రారంభమై 13 ఏళ్లు గడుస్తోంది. ఇప్పటికీ సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేవు. ప్రత్యేక వైద్య నిపుణులకు ఎంతో డిమాండ్ ఉంది. రోగ నిర్ధారణ, శస్త్రచికిత్సలకు అధునాతన పరికరాలు సమకూర్చాల్సి ఉంది. ఇవేవీ అందుబాటులో లేక రోగులు హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య సేవల అవసరాన్ని గుర్తించిన గత సూపరింటెండెంట్.. ఒప్పంద వైద్యుల ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం కొన్ని విభాగాల సేవలు ప్రారంభించారు. కానీ, ప్రత్యేక థియేటర్లు, అధునాతన పరికరాలు తగినన్ని లేవు. సేవలు అరకొరగా అందుతున్నాయి. పక్కనున్న ఆదిలాబాద్ ప్రభుత్వ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని అధికారికంగా అందుబాటులోకి తెచ్చారు. భారత వైద్య మండలి (ఎన్ఎంసీ) నిబంధనలకు సరిపడా వైద్యులున్న నిజామాబాద్ జీజీహెచ్‌పై మాత్రం చిన్నచూపు చూస్తున్నారు. సమస్యపై సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్ స్పందిస్తూ.. 'ప్రస్తుతం న్యూరో, యూరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నాం. అధికారికంగా సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని ప్రారంభించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం' అని అన్నారు.

**ఇదీ.. పరిస్థితి**

ఈ నెల 1న 2,339 ఓపీ నమోదైంది. 122 మంది ఇన్ పేషెంట్లుగా చేరారు. వీరిలో చాలా మందికి ప్రత్యేక వైద్య సేవలు అవసరం. ఆ స్థాయి నిపుణులు, పరికరాల్లేక పెద్దాసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు.




అత్యవసర కేసులు, హృద్రోగం, గుండెపోటు బాధితులు హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రులకు లేదా హైదరాబాద్‌కు వెళ్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ నిపుణుల్లేక రూ.7 కోట్ల విలువైన యాంజియోగ్రామ్ యంత్ర పరికరాన్ని రెండేళ్లుగా మూలన పెడుతున్నారు.

ప్రస్తుతం ఒప్పంద న్యూరో ఫిజిషియన్, యూరాలజీ వైద్య నిపుణులు ఇద్దరు సేవలందిస్తున్నారు. ప్రత్యేకంగా థియేటర్లు, పరికరాలు లేక శస్త్రచికిత్సలు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం అత్యవసర కేసులను చూస్తున్నారు. రోజుకు 15 న్యూరో, 10 వరకు యూరాలజీ ఆపరేషన్లు మాత్రమే చేస్తున్నారు.

హైదరాబాద్ మినహా రాష్ట్రంలో ఏ వైద్య కళాశాలలో లేనివిధంగా బ్రెయిన్ స్టంట్ వేసే వైద్యనిపుణుడు జీజీహెచ్‌లో ఉన్నారు. కావాల్సిన అధునాతన పరికరాల్లేక సదరు న్యూరో ఫిజిషియన్, ఇంటర్‌వెన్షన్ న్యూరాలజీ నిపుణుడు కేవలం ఓపీకే పరిమితమవుతున్నారు. అన్ని విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలను అధునాతన ఆపరేషన్ థియేటర్లు, యంత్ర పరికరాలతో అందుబాటులోకి తేవాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అవినీతి నేత్రం.. పైసలిస్తేనే పత్రం..!



నల్గొండ : జిల్లా కేంద్రం పరిధిలోని చర్లపల్లికి చెందిన ఓ మహిళ 2008 నుంచి 2011 వరకు జిల్లా కేంద్రాసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్‌నర్సుల కొలువుకు పరీక్ష రాయడంతో పాటు అనుభవ ధ్రువపత్రం కోసం జనరల్ ఆసుపత్రిలో సంబంధిత అధికారుల చుట్టూ పది రోజులు తిరిగినా రికార్డులు లేవంటూ చెప్పారు. అటు నుంచి డీసీహెచ్ఎస్(జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి) కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ను సంప్రదించగా రూ.10వేలు అడగడంతో అంత ఇచ్చుకోలేనని, రూ.6 వేలు అధికారి చెప్పిన వ్యక్తికి ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించారు. అడిగినంత నగదు ఇవ్వలేదన్న సాకుతో జిల్లా అధికారి సంతకం చేసిన ధ్రువపత్రాన్ని కూడా ఇవ్వలేదని బాధితురాలు 'న్యూస్‌టుడే'తో వాపోయారు. ప్రభుత్వం ఇటీవల ఆరోగ్యశాఖలో కొత్తగా కొలువుల ఎంపికకు కసరత్తు చేస్తుంది. దీని కోసం ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులకు సంబంధించి పోటీ పరీక్షలు కూడా నిర్వహించారు. అర్హత ఉన్నవారిని ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసిన ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల (అభ్యర్థులు)కు అనుభవ ధ్రువపత్రాలను పొందుపరిచే అవకాశం కల్పించారు. జనరల్ ఆసుపత్రితోపాటు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఈ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు సిబ్బంది పత్రాలు ఇవ్వడానికి సుముఖత చూపకుండా, కొన్ని దస్త్రాలు మాయం చేస్తున్నారు.

బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకొని అడిగినంత ఇచ్చిన తర్వాతనే పత్రాలు ఇస్తున్నారు. ఒక ఏడాది పనిచేసినట్లు వాస్తవ పత్రాలు ఇవ్వడానికి రూ.10 వేలు తీసుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. మరి కొందరికి రూ.20 నుంచి రూ.30 వేలు తీసుకుని 5 నుంచి 10 ఏళ్లు పనిచేసిన అనుభవం ఉన్నట్లు ధ్రువపత్రాలు ఇవ్వడంతోపాటు తనిఖీ సమయాల్లో దొరకకుండా రికార్డులను మాయం చేస్తున్నారు. ఈ దందా కార్యాలయ ఉన్నతాధికారులకు తెలియకుండా, వారిని పక్కదారి పట్టిస్తూ కొద్ది రోజులుగా పెద్దమొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని కార్యాలయాల సిబ్బంది తెలిపారు.

**చర్యలు తీసుకుంటాం**

డా.మాతృనాయక్, డీసీహెచ్ఎస్, నల్గొండ

అనుభవ పత్రాల కోసం వచ్చే నిరుద్యోగుల రికార్డులు పరిశీలించి వెంటనే ధ్రువపత్రాలు ఇస్తున్నాం. సకాలంలో వచ్చే అభ్యర్థులకు రికార్డులు వెతికి సంతకాలు చేస్తున్నాం. వారి నుంచి కింది స్థాయి సిబ్బంది డబ్బులు అడుగుతున్నట్లు మాకు ఎలాంటి ఫిర్యాదులు లేవు. పరిశీలించి డబ్బులు తీసుకునే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# బకాయిదారుల్లో భయం!



గరిడేపల్లి: టెండరు ధాన్యం బకాయిదారుల నుంచి ధాన్యం వసూలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. వారిపై పీడీ యాక్టు ప్రయోగించేందుకు క్యాబినెట్ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానిపై విధివిధానాలు కూడా రూపుదిద్దుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాదాపు 18 నెలలుగా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకుంటున్న మిల్లర్లకు ఉచ్చు బిగుసుకుంటోంది. రూ.కోట్ల విలువ చేసే ధాన్యం లేదా బియ్యం లేదా తత్సమానమైన డబ్బు జరిమానాలతో చెల్లించాల్సిందేనని పౌరసరఫరాల అధికారులు అంటున్నారు.

2022-23 యాసంగి సీజన్‌కు చెందిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లర్లకు అప్పగించారు. కొనుగోలు చేసే సమయంలో వర్షాలు పడటం, ధాన్యం భారీగా కొనాల్సి రావడంతో కొంత నాణ్యత లోపించిందని మిల్లర్లు కొర్రీలు పెట్టారు. అందుకు బియ్యం ఇచ్చే విషయంలో తక్కువ తూకంతో తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి భారాస ప్రభుత్వం యాసంగి ధాన్యాన్ని కొంత టెండరు ప్రక్రియ ద్వారా అమ్మకాలు చేయాలని నిర్ణయించింది. ఈలోగా ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా టెండరు పిలిచి అమ్మింది. ఇలా అమ్మిన ధాన్యం మిల్లర్ల వద్ద ఉంది. ప్రతి మిల్లు నుంచి ధాన్యం కానీ, బియ్యం కానీ, డబ్బు కాని ఇవ్వాలని గుత్తేదారు మిల్లర్లను కోరారు. మిల్లర్లు వివిధ కారణాలు చెబుతూ గుత్తేదారుకు ధాన్యం అప్పగించలేదు. అప్పటి నుంచి ప్రభుత్వం కొంత వసూలు చేసినా చాలా వరకు వారి దగ్గరే ఉండిపోయింది. దీంతో గుత్తేదారు కూడా ప్రభుత్వానికి డబ్బు చెల్లించకుండా నిలిపివేశాడు.

**రూ. 550 కోట్లకు పైగానే..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.550 కోట్లకు పైగా ఉన్న బకాయిల వసూలుకు ప్రభుత్వం గతంలో కొందరు మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టింది. అయినా బకాయి మిల్లర్లు తప్పించుకు తిరుగుతున్నారు. కొందరు తమ మిల్లుల పేర్లు మార్చేసి కొత్త పేర్లతో మళ్లీ సీఎంఆర్ ధాన్యం తీసుకున్నారు. కానీ ఈసారి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పీడీ యాక్టు ప్రయోగం చేయాలని నిర్ణయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా మిల్లర్లలో చర్చ జరుగుతోంది. బకాయిదారులలో ఆందోళన మొదలైంది.

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం వేలం వేయగా.. అందులో దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం(కొందరు డబ్బులు చెల్లించారు) గుత్తేదారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం మిల్లర్లు బకాయి పడ్డారు.

# పరుగు.. పాలపొంగుల వైపు..!



భువనగిరి : గూడులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే ముందుంది. కలెక్టర్ హనుమంతరావు, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 9,495 ఇళ్లు మంజూరయ్యాయి. ముగ్గులు పోసినవి 7,740 కాగా, ఇంకా పనులు ప్రారంభించనివి 1,755 ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు ప్రారంభించలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఆత్మకూరు(ఎం) మండలంలో 23 గ్రామపంచాయతీలకు మొదటి విడతలో 359 ఇందిరమ్మ ఇళు మంజూరయ్యాయి. 33 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు లేఖలు అందించారు. మిగతా 326 మంది ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా.. అందులో ఒకరు గృహ ప్రవేశం చేశారు. 56 మంది శ్లాబులు పూర్తి చేశారు. 226 మంది పునాదుల నుంచి లెంటల్ వరకు నిర్మించారు. మండలంలో బునాదిగాని కాల్వ పారుతుండటంతో ఇసుక తరలింపు నిలిచిపోయి నిర్మాణాలు కాస్త మందగించాయని అధికారులు వివరించారు. చౌటుప్పల్ పురపాలిక పరిధిలో 300 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 203 మంది సొంతంగా ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం ఇప్పించాలని కోరడంతో 30 మందికి రూ.లక్ష చొప్పున బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయించగా వారు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

**ఉన్న ఇంటిని కూల్చివేసి...**

ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన నమిల ఉషది నిరుపేద కుటుంబం. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలు. భర్త, ఇద్దరు సంతానం. మూడు నెలల క్రితం కుమార్తెకు పెళ్లి చేసింది. అనంతరం వారం రోజులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రేకుల ఇంటిని కూల్చివేసి ఇంటికి నిర్మాణానికి ముగ్గు పోసింది. అప్పుపుట్టకపోవడంతో ఇంటి నిర్మాణం నేటికీ 'ముగ్గు'కే పరిమితమైంది.

**జిల్లా వివరాలు...**

మంజూరైన ఇళ్లు : 9,495

ముగ్గులు పోసినవి : 7,740

పునాదులు పూర్తయినవి : 5,049

రూఫ్ లెవల్‌లో ఉన్నవి : 911

రూఫ్ లెవల్ దాటినవి : 248

పూర్తయిన ఇళ్లు : 10

ప్రారంభించనివి : 1,755

**రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉన్నాం**విజయ్‌సింగ్ (పీడీ, యాదాద్రి భువనగిరి జిల్లా) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉంది. నిర్మాణాలతో పాటు చెల్లింపుల్లో కూడా ముందంజలో ఉన్నాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

# ముక్కతోనే ముద్ద..!

భానుపురి: కొవిడ్ తర్వాత ఆహార శైలిలో మార్పులు చోటుచేసుకున్నాయి. శరీరానికి శక్తినిచ్చే పదార్థాలపై దృష్టిసారించారు. లాక్‌డౌన్ సమయంలో ఆరోగ్యకర ఆహారంపై దృష్టిసారించారు. అప్పటి నుంచి అదే అలవాటుగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మాంసం లేనిది ముద్దతినే పరిస్థితి లేకుండాపోయింది. అందులో చికెన్ అగ్రభాగాన నిలిచింది. **భారీగా వినియోగం** ఉమ్మడి నల్గొండ జిల్లాలో 11,42,708 కుటుంబాలు ఉన్నాయి.

వీటిలో 30 శాతం మంది కూరగాయల భోజనంపై ఆసక్తి చూపగా మిగతా వారు మాంసాహారాన్ని ఇష్టపడుతున్నారు. 70 శాతం కుటుంబాల్లో వారానికి నాలుగుసార్లు మాంసం లేనిది ముద్ద దిగటం లేదు. కొవిడ్ కంటే ముందు వారానికి ఒక్కసారి తినేవారు. అప్పటి నుంచి చేపలు, చికెన్, మటన్ లేకుంటే ఆ రోజు ఇంట్లో తిండి సహించడంలేదు. ఉమ్మడి జిల్లాలో 6లక్షలకు పైగా చిన్నారులు ఉన్నారు. వీరు ఏ శుభకార్యానికి వెళ్లినా అక్కడ కూరగాయల భోజనం ఉంటే తినేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులో ఎవరైనా బయటకు తీసుకెళ్లి బిర్యానీ వంటి వాటిని తినిపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రోజుకు 83 టన్నుల చికెన్ వినియోగిస్తారు. ఆదివారం, పండుగల వేళల్లో 85 నుంచి 90 టన్నుల వరకు అమ్మకాలు చేపడుతున్నారు. గత ఐదేళ్ల క్రితం 49 టన్నుల వాడకం ఉండగా ఇప్పుడు అదనంగా 34 టన్నులు పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 4115 చికెన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి దుకాణంలో రోజుకు 30 నుంచి 50 కిలోల వరకు విక్రయాలు చేపడుతున్నారు. ప్రత్యేక రోజుల్లో అమ్మకాలు రెట్టింపు సంఖ్యలో జరుగుతుంటాయి.

# శిథిల భవనాలతో 'భయం.. భయం'

బోధన్ : ప్రతిరోజూ వందలాది మంది ప్రజలకు సేవలందిస్తున్న బోధన్ మున్సిపల్, ప్రభుత్వ దవాఖానా భవనాలు శిథిలావస్థకు చేరాయి. 30 ఏళ్ల కిందట వీటిని నిర్మించారు. ప్రస్తుతం ఇవి వర్షం పడితే ఉరుస్తున్నాయి. ఫలితంగా రెండు భవనాలకు వచ్చే ప్రజలు, రోగులతో పాటు విధులు నిర్వహించే అధికారులు, వైద్యులు, ఇతర సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. రెండింటిలోనూ సేవలందించడం ఇబ్బందికరంగా మారింది.

**ఇదీ పరిస్థితి..**

బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానాకు నిత్యం 600 వరకు ఓపీ.. 60కి పైగానే ఐపీ ఉంటుంది. ఆసుపత్రిలోని పైఅంతస్తులో ఉన్న గదుల్లోని పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో గతంలోనే వీటిని మూసేశారు. ఉన్న గదుల్లోనే రోగులకు వైద్యం అందిస్తున్నారు. దీంతో కాలానుగుణ వ్యాధుల సమయంలో సరిపడా రూములు లేక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందించిన పరిస్థితి ఉంది. ఇటీవల ఇంజినీర్లు భవన పరిస్థితిని పరిశీలించారు. వారు



తమ నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఇక మున్సిపల్ కార్యాలయం వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. నేలగా తడిగా అవకుండా సిబ్బంది బకెట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు గోడలూ తేమగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయాన్ని మరో చోటుకు మార్చేందుకు పలు భవనాలను పరిశీలించారు. అవి కార్యకలాపాలు సాగించడానికి వీలుగా లేవని అధికారులు తేల్చడంతో ప్రస్తుతం ఉన్న భవనంలోనే సేవలు కొనసాగిస్తున్నారు. కొత్త భవనాలను నిర్మిస్తే మెరుగైన సదుపాయాలతో కూడిన సేవలందించే అవకాశముంది.

**అధికారులు ఏమన్నారంటే..**

మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన విషయాన్ని 'న్యూస్‌టుడే' కమిషనర్ జాదవ్ కృష్ణ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మరో చోటుకు కార్యాలయాన్ని మార్చేందుకు అనువైన భవనాలు లేవన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిత్ మాట్లాడుతూ.. ఇటీవల ఇంజినీర్లు ఆసుపత్రిని పరిశీలించి అందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామన్నారు. భవనానికి మరమ్మతులు చేస్తారా?, కొత్త భవనానికి నిధులు మంజూరు చేస్తారా? అనేది తేలాల్సి ఉందన్నారు.

# పంట చెడి.. గుండె తడి

బోధన్: వరస ముంపునకు గురైన పంట చేలు చేతికి రాకుండా పోయాయి. నియోజకవర్గంలోని బోధన్, సాలూర, నవీపేట్, రెంజల్ మండలాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పది రోజుల కిందట అల్పపీడన ప్రభావంతో ఎగువన మహారాష్ట్రలో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో గోదావరి పరీవాహకం, శ్రీరామసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు పోటెత్తాయి. పలు మండలాల్లో వరి, సోయా, పత్తి పైర్లు నీట మునిగాయి. మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా గత గురువారం రెండోసారి పైర్లు ముంపు బారినపడ్డాయి. నాలుగైదు రోజులు నీట మునగడంతో పైర్లు కుళ్లిపోయాయి. కళతప్పిన చేలను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు.

ఉమ్మడి బోధన్ మండలంలోని కొప్పర్గ, హంగర్గ, ఖండ్‌గాం, బిక్నెల్లి, సిద్దాపూర్, తగ్గెల్లి, ఖాజాపూర్, హున్సా, మందర్న, రెంజల్ మండలంలోని కందకుర్తి, బోర్గాం, నీలా, తాడ్‌బిలోలి, నవీపేట్ మండలంలోని అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ, యంచ, బినోలా నాళేశ్వర్, తుంగిని గ్రామాల్లో వేల ఎకరాలు జలమయం అయ్యాయి. వరి పొట్ట దశలో ఉండగా, సోయా కాయలు పాలు పోసుకుంటున్నాయి. పత్తి కాయ కాస్తోంది. వరుసగా రెండుసార్లు ముంపునకు గురవగా, చేతికందాల్సిన పైర్లన్నీ కుళ్లిపోయాయి. వరద తగ్గిన తర్వాత చేలకు వెళ్లిన రైతులు వాటిని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. సుమారు 5 మండలాలపై తీవ్ర ప్రభావం ఉండగా, 26 వేల ఎకరాల్లో పూర్తినష్టం వాటిల్లింది. అరటి, కూరగాయలు 330 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

**ఒక్క ఎకరా మిగల్లేదు..: ఇర్వంత్‌రావు, హంగర్గ**



ఈ ఖరీఫ్‌లో 20 ఎకరాల్లో సోయాబీన్ వేశా. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టా. పైరు కాయ దశకు రాగా గోదావరి వరదలు, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో పైరంతా మునిగింది. ఒక్క ఎకరా మిగల్లేదు. పెట్టుబడి, పంట ఆదాయం కలిపి మొత్తం రూ.20 లక్షల నష్టం వాటిల్లింది. మా కుటుంబం ఇప్పట్లో కోలుకునే పరిస్థితిలో లేదు.

**అప్పుల్లో కౌలు రైతులు: లక్ష్మణ్, హంగర్గ**

భూమి కౌలుకు తీసుకుని మూడెకరాల్లో సోయా, రెండెకరాల్లో వరి వేశా. ఒక ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా. రెండు పంటలూ వరద పాలయ్యాయి. ఖరీఫ్‌లో పంట చేతికందితేనే రబీలో పంట సాగు చేసే పరిస్థితి. పూర్తి పంట నష్టంతో అప్పులే మిగిలాయి. బ్యాంకులో, ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టా. శ్రమంతా నీటిపాలైంది. ప్రభుత్వం పరిహారమివ్వాలి. యాసంగికి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి.

# జలాశయంలో బురద.. నీటి శుద్ధిపై ప్రభావం

వేములవాడ : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) జలాశయంలోకి ఇటీవల కురిసిన వర్షాలతో భారీగా నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం జలాశయంలోని బురద పైకి తేలి నీటి శుద్ధిపై ప్రభావం చూపుతోంది.

**రంగు మారి..** సిరిసిల్ల, వేములవాడతోపాటు చొప్పదండి నియోజకవర్గంలోని 490 ఆవాసాలకు రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నీరే ఆధారం. రుద్రవరంలోని ఇన్‌టేక్‌వెల్ నుంచి అగ్రహారంలోని మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లోకి నీరు వెళ్తోంది. సాధారణంగా పీఏసీ(పాలీ



అల్యూమినియం క్లోరైడ్) పద్ధతిలో నీటిని శుద్ధి చేస్తారు. నెలలో రెండు లేదా మూడు సార్లు ఫిల్టర్‌బెడ్లను శుభ్రం చేస్తారు. జలాశయం నుంచి మిషన్ భగీరథ పథకానికి ప్రతి రోజు సుమారు 107 ఎంఎల్‌డీల నీటిని వినియోగిస్తారు. ప్రస్తుతం జలాశయంలోకి బురద భారీగా వచ్చి నీటితోపైకి తేలి మిషన్ భగీరథ నీటి శుద్ధిపై ప్రభావం చూపుతోంది. నీరు శుద్ధి జరిగినా రంగుమారి వస్తోంది.

**ఈ నీటిని తాగొద్దు**

జలాశయంలోకి వచ్చిన నీటితో బురదపైకి తేలడం వల్ల శుద్ధిపై ప్రభావం చూపుతోంది. శుద్ధి చేసిన నీరు రంగు మారడం వల్ల రోజువారీ అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించుకోవాలి. తాగు నీటిగా వాడొద్దు మరో రెండు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఆ తర్వాత తాగొచ్చు.విశ్వ, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ

# పంటల సాగు... సాంకేతిక దన్ను

రాజపేట : జిల్లాలో సింహభాగం రైతులు వ్యవసాయం, అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇలాంటి తరుణంలో కూలీల అవసరం అనివార్యంగా మారనుంది. చాలాచోట్ల వ్యవసాయ కూలీల కొరత వేధిస్తోంది. దీనిని ఆసరాగా చేసుకుని పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, బిహార్, మహారాష్ట్ర, అస్సాం రాష్ట్రాల నుంచి కూలీలు బృందాలుగా వచ్చి సాగు పనులు చేపడుతున్నారు. శ్రామిక శక్తి తగ్గిపోతుండటంతో రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గుచూపుతున్నారు. ట్రాక్టర్లు, వీడర్లు, డ్రోన్లు, తైవాన్ బ్యాటరీ స్ప్రేయర్లు, కలుపుతీత యంత్రాల కొనుగోలుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రాయితీపై వీటిని అందిస్తే మరింత భరోసా ఉంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**కలియ దున్నడానికి.. వీడరు..**

పంటల్లో అంతర కృషి పనులు అధికంగా అరకలతో చేసేవారు. పశు పోషణ భారంగా మారడంతో రైతులు వీడర్లు కొనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల యంత్రాలను బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్నాయి. లీటరు పెట్రోల్‌తో ఎకరం భూమిని కలియదున్నవచ్చు.

**డ్రోన్‌తో పిచికారీ...**

పంటలపై ఆశించిన చీడపీడల నివారణకు స్ప్రేయర్లతో పిచికారీ చేయడం పాత పద్ధతి. ఇప్పుడు డ్రోన్ వినియోగం విరివిగా పెరిగింది. రోజుకు కనీసం 30-40 ఎకరాల్లో పిచికారీ చేయవచ్చు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించి రైతు సంఘాలు, జీవనోపాధి కోసం ఆసక్తి గల వారు బ్యాంకు రుణాలతో కొనుగోలు చేస్తున్నారు. డ్రోన్ పిచికారీతో సమయం ఆదా అవుతుంది. వీటిని సమాఖ్య సంఘాల ద్వారా మహిళా రైతులకు రాయితీపై అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి.

**సౌర కంచెలు, సీసీ కెమెరాల ఏర్పాటు...**

పంటలను అడవి పందులు, కోతులు, ఇతర జంతువుల బారి నుండి కాపాడుకోవడానికి చాలా మంది రైతులు మార్కెట్లో దొరికే సౌర పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. బ్యాటరీ సాయంతో పొలం చుట్టూ కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. తేలికపాటి విద్యుత్తు సరఫరా జరుగుతుంది. జంతువులు, మనుషులకు ఎలాంటి హానీ లేకుండా పంటలను సులువుగా కాపాడుకోవచ్చు. దీనికి తోడు వ్యవసాయ క్షేత్రాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు.

**జిల్లా సమాచారం (ఎకరాల్లో)**

సాగుకు యోగ్యమైన భూమి : 6.15 లక్షలు
సాగు చేపడుతుంది : 4.5 లక్షలు
రైతులు : 2.28 లక్షలు
వానా కాలంలో సాగు అంచనా : 2,95,000
ప్రస్తుతం సాగు చేసింది : 68 శాతం

# తలలు పగిలేలా.. గుంతలు

సూర్యాపేట: :ఇది తుంగతుర్తి మండలం రావులపల్లి తండా నుంచి రావులపల్లి వెళ్లే మార్గంలో అత్యంత ప్రమాదకరంగా గుంతలు ఏర్పడిన రోడ్డు. వానలకు మరింత ధ్వంసమై రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురిసిన వానలకు ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. చిన్నపాటి గుంతలు కాస్త ధ్వంసమై గోతులను తలపిస్తున్నాయి. చిరుజల్లు పడితే చాలు అందులో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. రాత్రి సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గమ్యాన్ని చేరాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. గుంతలను పూడ్చి ప్రాణభయాన్ని తొలగించాలంటూ ఆప్రాంత ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా వాటి మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదిత అంచనాలను సిద్ధం చేసినట్లు ఆశాఖ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.22.5 లక్షలు: వానలకు దెబ్బతిన్న రోడ్లను అధికారులు గుర్తించారు. జిల్లాలోని సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ సబ్‌డివిజన్ల పరిధిలోని 50 ప్రదేశాల్లో 1,066 మీటర్ల మేర దెబ్బతిన్నాయి. రూ.22.50 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు, రూ.41 కోట్లతో శాశ్వత పనులు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనల నివేదికను సిద్ధం చేసి సర్కారు పంపించారు. నిధులు మంజూరు కాగానే పనులు చేస్తామని ఈఈ సీతారామయ్య పేర్కొన్నారు.

గుంతలతో ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డు సూర్యాపేట నుంచి నూతనకల్ వెళ్లే ప్రధాన రహదారి. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ఇలా దెబ్బతిన్నది. నిత్యం రాకపోకలు సాగిస్తున్న వందలాది వాహనాలతో గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. ఆ ప్రాంతాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఆ బిర్యానీ.. ఆరోగ్యానికి హానీ



హైదరాబాద్: వారాంతం.. ఇంట్లో వేడుక.. ఇలా ఏదైనా ముందుగా అందరికీ గుర్తుకొచ్చే ఆహారం బిర్యానీ. హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. ఇదే అదనుగా పలు హోటళ్ల యజమానులు, నిర్వాహకులు 'తక్కువ ధరకే బిర్యానీ' పేరుతో నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నారు. బిర్యానీల్లో నాసిరకం, గడువు ముగిసిన పదార్థాలు వినియోగిస్తున్నట్లు ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లోనూ తేలింది. ఆహారం ఆకర్షణీయంగా కనిపించడం కోసం హానికర రసాయనాలు వాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

**వీటి వినియోగంతో ప్రమాదమే**

పలు బిర్యానీ సెంటర్లలో తక్కువ ధరకు లభించే అనారోగ్యానికి గురైన కోడి మాంసం, నాణ్యత తక్కువగా ఉండే బాస్మతి బియ్యం, పామాయిల్, నాసిరకం సరకులు, హానికర రంగులు, టేస్టింగ్ సాల్ట్, తక్కువ ధర అల్లం వెల్లుల్లి వినియోగిస్తున్నారు. టేస్టింగ్ సాల్ట్ ఎక్కువగా వాడిన ఆహారం తరచూ తింటే పేగులు పాడవుతాయి. కృత్రిమరంగులతో క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన మాంసం తింటే ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదముంది.

**వెలుగులోకి కొన్ని మోసాలు**

నాంపల్లిలోని ఓ హోటల్‌లో గడువు ముగిసిన పదార్థాలను బిర్యానీ వంటకాల్లో వినియోగిస్తున్నట్లు ఆహార భద్రతా అధికారుల తేల్చారు. గచ్చిబౌలిలోని మహాలక్ష్మి బిర్యానీ సెంటర్‌లోని రిఫ్రిజిరేటర్‌లో కొన్నిరోజులుగా నిల్వ ఉంచిన మాంసాన్ని గుర్తించారు.

ఉప్పల్‌లోని బిర్యానీ సెంటర్‌లో ముందురోజు మిగిలిపోయిన బిర్యానీని వేడిచేసి విక్రయిస్తున్నట్లు అధికారులు తనిఖీల్లో తెలిసింది. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయండిలా..

గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగం, ఆహార నాణ్యత లేమిపై ఆహార భద్రతా అధికారులకు ఫోన్, సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ప్రాంతం, రెస్టారెంట్/హోటల్ పేర్లు స్పష్టంగా చెబితే చర్యలు తీసుకుంటారు.

**గ్రేటర్ పరిధిలో..**

టోల్‌ఫ్రీ నంబర్: 040-21111111
మెయిల్: %foodsafetywing.ghmc@gmail.com
ట్విటర్ (ఎక్స్): @afcghmc

# ఉన్నతి.. వనితల ఆర్థిక పెన్నిధి



ధర్మారం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కింద 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల కోసం ఉన్నతి పథకాన్ని తీసుకొచ్చారు. ఆసక్తి కలిగి ఉన్న వారికి స్వయం ఉపాధి అంశాలపై శిక్షణ ఇప్పించి బ్యాంకుల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందించాలన్నది ఈ పథకం లక్ష్యం. సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా భారతీయ స్టేట్ బ్యాంకు సౌజన్యంతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వీరికి శిక్షణ ఇస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది.

**తక్కువ పెట్టుబడితో రాబడి**

జిల్లాలో 651 మందికి శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యంకాగా ఇప్పటి వరకు వేర్వేరు అంశాలలో 544 మందికి శిక్షణ పూర్తయింది. గత ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాల నుంచి ఆసక్తి కలిగిన యువతీ యువకులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ కాలంలో రోజుకు రూ.307 చొప్పున వేతనం, భోజన వసతి కల్పించారు. అగర్‌బత్తీలు, కొవ్వొత్తులు, జూట్ బ్యాగుల తయారీ, కుట్టు శిక్షణ, పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. అంతర్గాం, పాలకుర్తి, జూలపల్లి, శ్రీరాంపూర్, ఓదెల, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, పెద్దపల్లి మండలాల్లో శిక్షణ పూర్తయింది.

అదనపు పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ 'యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన తోడ్పాటు అందిస్తాం. మిగతా మండలాల్లోనూ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. శిక్షణ పొందినవారికి ధ్రువపత్రాలు ఇస్తున్నాం' అని తెలిపారు.


**ఆత్మవిశ్వాసం పెరిగింది**

శిక్షణలో అగర్‌బత్తీల తయారీ గురించి నేర్పించారు. సొంతంగా ఇంటిపట్టునే ఉంటూ తక్కువ పెట్టుబడితో రాబడి పొందే విషయం తెలుసుకున్నా. తయారీతోపాటు ముడిసరుకు సేకరణ, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఇతర పనులు చేసుకుంటూ వీలు కుదిరిన సమయంలో రెండు గంటలు పని చేసినా కుటుంబాన్ని పోషించుకోగలననే ఆత్మవిశ్వాసం పెరిగింది. కొద్దిరోజుల్లో ఇంటి వద్ద యూనిట్ ఏర్పాటు చేసుకుంటా. సుహాసిని

**ఇంటి పట్టునే ఉంటూ సంపాదన**

మాది వ్యవసాయ కూలీ కుటుంబం. వ్యవసాయ పనులు లేనప్పుడు ఇతర, ఉపాధిహామీ పనులకు వెళ్తా. కూలీ పని చేస్తేనే మా కుటుంబం గడుస్తుంది. ఈ శిక్షణ నాలాంటి వారికి మేలు చేస్తుంది. అగర్‌బత్తీలు తయారు చేయడంతో ఇంటిపట్టునే ఉంటూ కనీసం రోజుకు రూ.500 సంపాదించగలననే నమ్మకం కలిగింది. ఎం.స్వరూప

# సర్కారు దవాఖానాల్లో అరకొర సేవలు



కోరుట్ల : జగిత్యాల తర్వాత జిల్లాలో జనాభా, విస్తీర్ణం పరంగా పెద్దవైన కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పూర్తి స్థాయి వైద్య వసతులు లేక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించడం పరిస్థితికి అద్దం పడుతోంది. మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి భవనం లేకపోగా, కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది కొరత నెలకొంది. దీంతో ప్రాథమిక చికిత్స అనంతరం జగిత్యాల ఆసుపత్రికి పంపించాల్సిన పరిస్థితి నెలకొంది.

**పెద్దాసుపత్రిలో సిబ్బంది కొరత**

కోరుట్ల సామాజిక ఆసుపత్రిని 2021లో వైద్య విధాన పరిషత్‌లోకి మార్చి ఏరియా ఆసుపత్రిగా ఉన్నతీకరించారు. 30 పడకల నుంచి 100 పడకలకు పెంచేందుకు రూ.16.80 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో కొత్తగా భవనం నిర్మించారు.

అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో పనులు పూర్తి కాకుండానే 2023 జూన్ 10న భవనాన్ని ప్రారంభించారు. 2024 ఆగస్టులో భవనం అందుబాటులోకి రాగా ఆసుపత్రిలో 13 మంది వైద్యులకు కేవలం 9 మంది మాత్రమే ఉన్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్టు వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి రోజూ 400-500 వరకు ఓపీ ఉంటోంది. పూర్తి స్థాయిలో సిబ్బంది లేక భవనంలోని కింది అంతస్థును మాత్రమే వినియోగిస్తున్నారు.

ఒకటి, రెండో అంతస్థుల్లోని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, పిల్లల వార్డు, ఇతర వార్డులు వృథాగా పడి ఉన్నాయి. సీఏఆర్ఎం, ఎక్స్‌రే యంత్రాలు, ఆక్సిజన్ ప్లాంట్ మంజూరైనా టెక్నీషియన్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కలిసి మొత్తం 56 మంది ఉన్నారు. మరో 40 మందిని నియమించాల్సి ఉంది.

అసంపూర్తిగా భవన నిర్మాణంమెట్‌పల్లి సామాజిక ఆసుపత్రికి పట్టణ, మండలవాసులే కాకుండా మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలు, పొరుగున ఉన్న నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి రోగులు వస్తున్నారు. దీంతో 200-300 వరకు ఓపీ నమోదవుతోంది. భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్తగా నిర్మాణానికి టీఎస్ఎంఐడీసీ కింద రూ.7.50 కోట్లు మంజూరు చేశారు. పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా 70 శాతం వరకే జరిగాయి. బిల్లులు రావడం లేదని గుత్తేదారులు మధ్యలోనే నిలిపివేశారు. పాత భవనం పైకప్పు చాలా చోట్ల పెచ్చులూడుతోంది. ఆపరేషన్ థియేటర్ సమీపంలో పెకప్పు దెబ్బతింది. వర్షానికి ఉరుస్తుండటంతో గోడలు తడిగా మారుతున్నాయి. ఎక్స్‌రే గది గోడలు తడిగా మారడంతో యంత్రాలు పాడయ్యే ప్రమాదం ఉంది. ఆసుపత్రిలో రక్త నిల్వ కేంద్రానికి, ఐసీటీసీ, ఇతర ల్యాబ్‌లకు, ఆపరేషన్ థియేటర్‌కు, ఓపీ నమోదుకు గదుల కొరత తీవ్రంగా ఉంది.

# మణుగూరు.. పర్యాటకంలో జోరు

మణుగూరు : మణుగూరు పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చెందనుంది. పరిశ్రమలతో పాటు అటవీ ప్రాంతం ఉండటంతో ఆ దిశగా అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. అడ్వెంచర్ పర్యాటకాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు మణుగూరులో రథం గుట్టను ఎంపిక చేశారు. ఎత్తైన కొండలు, అటవీ జీవ వైవిధ్యం, జలపాతాలు రథం గుట్టకు ప్రత్యేక ఆకర్షణ. పర్యాటకులు చేరడానికి మార్గం సౌకర్యవంతంగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లా యువజన, క్రీడల శాఖ సమన్వయంతో కొద్ది రోజుల క్రితం రథం గుట్టను పరిశీలించారు. పుణెకి చెందిన నైయిల్ ఇండియా అడ్వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు అంచనా రూపొందించనున్నారు.



**ఎంతో మందికి ఉపాధి..**

అడ్వెంచర్ పర్యాటకంలో జిప్‌లైన్, జిప్ బైక్, అద్దాల వంతెన, రాకెట్ ఈజెక్షన్ వంటివి ఉండనున్నాయి. ఇవి ఏర్పాటు చేయాలంటే ఖర్చుతో కూడినది. అయినా ప్రభుతం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. అడ్వెంచర్ పర్యాటకం ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కలగనుంది. గైడ్స్, నిర్వహణ సిబ్బంది, అడ్వెంచర్ శిక్షకులు వంటి ఉద్యోగాలు ఏర్పడతాయి. రథం గుట్టను ప్రాంతీయ రాష్ట్ర, దేశీయ పర్యాటకులకు పరిచయం చేయటం జరుగుతోంది. జిల్లాలో కిన్నెరసాని, ఇల్లెందులోని ఊరగుట్ట, మణుగూరులోని రథం గుట్టను అడ్వెంచర్ పర్యాటకం ఏర్పాటుకు ఎంపిక చేశారు. మిగిలిన రెండు ప్రదేశాల కన్నా రథంగుట్ట అనుకూలమైన ప్రాంతం అని అధికారులు నిర్ధారణకు వచ్చారు. మణుగూరులో రథం గుట్టను అడ్వెంచర్ పర్యాటకంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అనుకూలతలు ఉన్నాయి. దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి.

– పరంధామరెడ్డి, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి

# పొలాల్లో రాళ్లు.. కర్షకుల కన్నీళ్లు


కామారెడ్డి: జిల్లాలో భారీ వర్షం సృష్టించిన బీభత్సం కర్షకులకు కన్నీళ్లని మిగిల్చింది. ఎక్కడ చూసినా పంట పొలాల్లో ఇసుక, రాళ్ల మేటలే కనిపిస్తున్నాయి. ఎవరి భూమి ఏదో తెలియని పరిస్థితి నెలకొంది. చెరువులు తెగిన ప్రాంతాల్లోని పొలాల్లో నడుం ఎత్తు ఇసుక, భారీ రాళ్లు కొట్టుకొచ్చాయి. కొందరి బోర్లు సైతం కొట్టుకుపోయాయి. ఆ భూములు సాగుకు ఉపయోగపడతాయా లేదా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**వరదలో కొట్టుకుపోయిన కష్టం**

జిల్లాలో సుమారు 49 వేలకు పైగా పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మంగళవారం పలువురు రైతుల్ని 'ఈనాడు' పలకరించగా.. తమ కష్టంతో పాటు రూ.లక్షల పెట్టుబడిని వరద నీటిలో పోసినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకమేట వేసిన ప్రాంతాల్లో రైతులు కన్నీటి పర్యంతమవుతూ కనిపించారు. చెరువుల సమీపంలోని పొలాలు నామరూపాల్లేకుండా పోయాయి. రోడ్లు తెగి డాంబార్, కంకర కొట్టుకొచ్చాయి. పలువురి పశువులు కొట్టుకుపోయాయి.

**లింగంపేటలోనే 400 ఎకరాలు**

లింగంపేట మండలంలోనే సుమారు 400 ఎకరాలకు పైగా భూముల్లో ఇసుక మేటలు వేసింది. కొన్ని పొలాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. పంట నష్టం పక్కకు పెడితే మళ్లీ సాగు భూమిగా మార్చడానికి ఎంత ఖర్చు చేయాల్సి వస్తుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కన్నాపూర్ గ్రామంలోని చౌదరి చెరువు



తెగడంతో దిగువన ఉన్న భూముల్లో కనుచూపు మేర భారీ రాళ్లు, ఇసుక మేట వేసింది.

**కౌలు రైతుల పరిస్థితి దయనీయం**

కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ప్రభుత్వాలు ఇచ్చే నష్టపరిహారం పెట్టుబడికి కూడా రాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసిన ఒకట్రెండు ఎకరాల్లో పంట నష్టపోయి కోలుకోలేని స్థితిలో ఉన్నారు. రాజంపేట, ఎల్లారెడ్డి, పిట్లం, దోమకొండ, పల్వంచ మండలాల్లో పంట నష్టం అధికంగా ఉంది.

**ప్రభుత్వమే ఆదుకోవాలి: మహేష్, కౌలురైతు, దోమకొండ**

'సొంత భూమి లేక 5.20 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశా. పంట మంచిగా ఏపుగా ఎదుగుతుందనుకునేలోపే భారీ వర్షం కురిసింది. రెండు ఎకరాలకు పైగా కొట్టుకుపోయి ఎడారిలా మారింది. మరోవైపు ఇల్లు కూడా పాక్షికంగా కూలింది. దిక్కుతోచని స్థితిలో ఉన్నా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**సర్వే కోసం తిరిగే ఓపిక లేదు: కుమ్మరి గోపాల్, లింగంపేట రైతు**

'3.20 ఎకరాల్లో పొలం వేశాను. రూ.2 లక్షలకు పైగా ఖర్చు అయింది. అకస్మాత్తుగా వరదలు రావడంతో పొలం నామరూపాల్లేకుండా పోయింది. సరిహద్దులు కూడా కనిపించడం లేదు. ఇప్పటికే పెట్టుబడిని కోల్పోయా. మళ్లీ భూ సర్వేల కోసం అధికారుల చుట్టూ తిరిగే ఓపిక లేదు. తలుచుకుంటేనే భయమేస్తోంది.'

# మార్కెట్ యార్డు అభివృద్ధికి మోక్షమెప్పుడు

రాయికల్ : రైతులకు సేవలందించి పంటలు కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన రాయికల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పనులపై పర్యవేక్షణ లేక బిల్లులు రాక పనులు ముందుకు సాగడంలేదు. గతంలో ధర్మపురి వ్యవసాయ మార్కెట్‌కు ఉప కేంద్రంగా ఉన్న రాయికల్‌ను ప్రత్యేక మార్కెట్ యార్డుగా 2016లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2017లో తొలి పాలకవర్గాన్ని ఏర్పాటుచేసింది. అయితే రెండేళ్ల క్రితం కమిటీలను రద్దు చేయగా నూతన కమిటీలను ప్రభుత్వం ఇంకా ఏర్పాటు చేయలేదు.



**బిల్లులు రాక నిలిచిన పనులు**

రాయికల్‌లో మార్కెట్ కమిటీ సుమారు ఆరు ఎకరాల్లో కొనసాగుతుండగా.. కార్యాలయం, గిడ్డంగులను నిర్మించారు. రెండేళ్ల క్రితం మార్కెట్ యార్డులో రూ. 1.80 కోట్లతో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, రూ. 20 లక్షలతో మట్టి పనుల నిర్వహణకు టెండరు పూర్తి చేసి పనులను ప్రారంభించారు. రూ. 20 లక్షలతో మట్టి పనులు పూర్తయినప్పటికి ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయలేదు. బిల్లులు రాక గుత్తేదారులు పనులు నిలిచాయి. యార్డులో పనులు పూర్తి కాకపోవడంతో వసతులు కరవయ్యాయి.

**ఏటా ఆరు బయటే కొనుగోళ్లు**

యార్డులో వసతులు లేక ఏటా వరి, మక్కలు తదితర పంటలను మార్కెట్ పక్కనే ఉన్న స్థలాల్లో ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వర్షాలు కురిస్తే పంటలు తడిసి కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డుకు ఆదాయమున్నా వసతులు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు పంటలు మినహా ఇతర పంటలు కొనుగోలు చేయకపోవడంతో పప్పులు, ఇతర వాణిజ్య పంటలను దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. మార్కెట్ కమిటీకి పాలకవర్గం ఏర్పాటుచేసి నిధులు మంజూరు చేసి వసతులు కల్పించాల్సి ఉంది.

# శుభ్రత.. అప్రమత్తత అవసరం

కరీంనగర్ : కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాల్లో పౌష్టికాహారం అందిస్తున్నా.. విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఇటీవల రాష్ట్రంలోని పలు విద్యాలయాల్లో ఈ పరిస్థితి ఏర్పడగా జగిత్యాల జిల్లాలోనూ గత నెల జ్యోతిభాపులే గురుకులంలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నా ఇలాంటి ఘటనలు తరచూ పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గురుకులాల్లో స్టీల్ పాత్రల్లో వంట చేసే కార్యక్రమానికి ఇటీవలే సంక్షేమ శాఖల మంత్రి లక్ష్మణ్‌కుమార్ శ్రీకారం చుట్టారు. స్టీల్ పాత్రల్లో వండటంతోపాటు జాగ్రత్తలు తీసుకుంటేనే ఇబ్బందులు తప్పుతాయి.

**89 గురుకులాలు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 89 గురుకులాలు ఉండగా సుమారు 45 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆహార పదార్థాల నిల్వలో, వండే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో భోజనం వికటించడానికి కారణమవుతోందని అధికారుల తనిఖీల్లో వెల్లడవుతోంది. గుత్తేదారులు గంపగుత్తగా కూరగాయలు తెచ్చి, గాలి వెలుతురు సరిగా లేని ప్రాంతాల్లో నిల్వ చేయడం, క్రిమిసంహారక మందులతో పెంచుతున్న కూరగాయలు, ఆకుకూరలను సరైన రీతిలో శుభ్రం చేయకపోవడం, వండటంలో నిర్లక్ష్యం సమస్యకు కారణమవుతోంది.

**వైద్యుల సూచనలు ఇవీ..**

కూరగాయలు, ఆకుకూరలు రెండు రోజులకన్నా ఎక్కువ నిల్వ చేయొద్దు. గాలి, వెలుతురు ఉండే ఆవరణలో విడివిడిగా నిల్వ చేయాలి. వర్షాకాలంలో ఆకుకూరలు, క్యాబేజీ, కాలీఫ్లవర్, పప్పులు, మాంసాహారం ఒకే రోజు వండొద్దు. వంట గదులు, సరకులు నిల్వ చేసే



ప్రదేశాలు, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. శుద్ధ నీటినే తాగాలి. వంట అవసరాల కోసం వినియోగించాలి.

ఏరోజు పాలను ఆరోజే వాడాలి. వంద శాతం మరిగిన పాలనే విద్యార్థులకు అందించాలి కోడిగుడ్లు, మాంసాహారాన్ని శుభ్రంగా కడగడంతోపాటు పూర్తి స్థాయిలో ఉడికించాలి.

రోజంతా పప్పు ధాన్యాలు తింటే జీర్ణక్రియ సమస్యలు ఏర్పడతాయి. పప్పు ఉన్న రోజు అల్పాహారంగా పండ్లు, రాగిజావ, కూరగాయలు వంటి వాటిని అందించాలి

కూరగాయలను వండే ముందు ఉప్పు లేదా వెనిగర్‌తో శుభ్రం చేస్తే బ్యాక్టీరియా నశిస్తుంది. వండే ముందు మాత్రమే కూరగాయలను కోస్తే బ్యాక్టీరియా వృద్ధి చెందదు.

ప్యాకెట్లలోని పదార్థాలను వాడేటప్పుడు కాలం అయిపోయినవి, పాడైపోయిన వాటిని ఉపయోగించకూడదు

వంట చేసేవారు చేతులకు తొడుగులు, తలకు టోపీలు, యాప్రాన్‌లు ధరించాలి. అనారోగ్యంతో ఉంటే వంట జోలికి వెళ్లొద్దు

విద్యార్థులు ఆహారం తినకముందు, తిన్న తరువాత... వంట చేసేవారు తరచూ చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

ఏ పూట వండిన ఆహారం ఆ పూటకే వినియోగించాలి

పాత్రలు ఉపయోగించే ముందు, ఉపయోగించిన తరువాత శుభ్రంగా కడగాలి **సరైన రీతిలో వండాలి – స్ఫూర్తి బుర్ర, డైటీషియన్, కరీంనగర్**

పరిశుభ్రతను అన్ని చోట్లా పాటించడంతోపాటు వాతావరణ పరిస్థితులను బట్టి ఆకుకూరలు, మాంసాహారం, పప్పుల వాడకంలో మార్పులు చేయాలి. పాలు, పెరుగు, మాంసాహారాన్ని సరైన రీతిలో వేడి చేయకపోవడం, ఉడికించని కారణంగా వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. అల్యూమినియం పాత్రల కంటే స్టీలు పాత్రల్లో వండటం శ్రేయస్కరం.

# ఒక్కొక్కటిగా.. చిక్కుముళ్లు వీడేలా..



కొత్తగూడెం : భూ సమస్యల పరిష్కారానికి అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని భూసమస్యల చిక్కుముళ్లు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. విరాసత్, వివరాల సవరణ, మ్యుటేషన్ వంటి వాటిని తహసీల్దారు సమక్షంలో పరిశీలించి అర్హత కలిగిన దరఖాస్తుదారులకు వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు. గ్రామాల్లో అసైన్డ్ భూముల వివరాలు నమోదు చేయాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. భూములు పొందినవారి పట్టాలను పరిశీలించటంతో పాటు ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో ఏళ్లుగా ఉంటున్నవారిని అధికారులు గుర్తించనున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అసైన్డ్ భూముల లెక్కలు తేలనున్నాయి.

ఆగస్టు 10 నాటికే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలనుకుంటున్నాం. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమైన వాటికి వెంటనే పాసుపుస్తకాలు ఇస్తున్నాం. సాదాబైనామా, అసైన్డ్, పీఓటీ దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వాటిని గుర్తిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటిని పరిష్కరిస్తాం.

– మధు, ఆర్డీఓ, కొత్తగూడెం

మండలాల వారీగా పరిష్కారం..నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు నడుం బిగించారు. మండలాల వారీగా వచ్చిన సమస్యల వివరాలు తీసుకుని అందులో సులువుగా పరిష్కారమయ్యే వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. విస్తీర్ణాల హెచ్చుతగ్గులకు సంబంధించిన దరఖాస్తుదారులకు నోటీసులు ఇస్తున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వచ్చాక.. వాటినీ పరిష్కరించనున్నట్లు తెలుస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, పట్టా భూమి ఉండి నిషేధిత జాబితాలో చేరిన వాటిపై దృష్టి సారిస్తున్నారు. ఆర్ఐ, తహసీల్దార్లు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి ఆర్డీఓ, కలెక్టర్ లాగిన్‌కు చేరవేస్తున్నారు. ఉభయ జిల్లాల్లో సాదాబైనామా, అసైన్డ్ భూములు, గిరిజన, గిరిజనేతర భూవివాదాలు, పోడు సమస్యల దరఖాస్తులు అధికంగా ఉండటంతో వాటిని పరిశీలించి పక్కనపెడుతున్నారు.

# పర్యవేక్షిస్తేనే ఫలితాలు ఆశాజనం




ఖమ్మం : తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం(టీహబ్) సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా లభిస్తున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం సర్వజనాసుపత్రుల్లోని కేంద్రాలకు 134 రకాల పరీక్షలు చేసే సామర్థ్యం కలదు. ప్రస్తుతం 120 రకాల వరకు చేస్తున్నారు. రక్తపరీక్షలు, బయోకెమిస్ట్రీ, హిస్టోపాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల్లో పరీక్షలు జరిపేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటంతో 2024తో పోల్చితే 2025లో రోగులు, నమూనాల సేకరణ, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 2024లో జనవరి నుంచి జులై వరకు 1,13,405 మంది రోగుల నుంచి 2,15,807 నమూనాలు సేకరించి 4,14,674 రకాల పరీక్షలు చేశారు. ఈ ఏడాదిలో 20 శాతానికి పైగా నమూనాలు తగ్గటం గమనార్హం.

ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక, పట్టణ, బస్తీదవాఖానాలతో పాటు సర్వజనాసుపత్రి, ఈహెచ్ఎస్ క్లీనిక్‌ల్లో చికిత్సలు పొందే రోగులకు చెందిన రక్తనమూనాలకు టీహబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 48 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల నుంచి రోజూ నమూనాలు సేకరిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 29 పీహెచ్‌సీల పరిధి నుంచి రక్తనమూనాలు కొత్తగూడెంలోని టీహబ్‌కు చేరుతున్నాయి.

ఆరోగ్య కేంద్రాల నుంచి రక్తనమూనాలను టీహబ్‌కు చేర్చే వాహనాలు కొన్ని సందర్భాల్లో ఆగిపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో రోగులు ప్రైవేటు ప్రయోగశాలలు లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. 'వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఏ రోజుకు ఆరోజు నివేదికలు పంపిస్తున్నాం. అడపాదడపా సమస్యలు ఉత్పన్నమైనా వాటిని పరిష్కరిస్తున్నాం' అని కొత్తగూడెం టీహబ్ ఇన్‌ఛార్జి నజీరుద్దీన్‌కు తెలిపారు.

**తగ్గుదలకు కారణాలు..**

టీహబ్‌లో పరీక్షల నిర్వహణకు తరచూ ఆటంకం కలుగుతోంది. పరీక్షలకు అవసరమైన రీఏజెంట్ల సరఫరాలో జాప్యం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఐడీసీ) వీటిని సరఫరా చేస్తుంది. యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి మరమ్మతులు చేపట్టడానికి స్థానికంగా నిపుణులు లేకపోవటం సమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలామందికి స్మార్ట్ ఫోన్లు ఉండకపోవటంతో పరీక్షల నివేదికలు సత్వరం అందటం లేదు. నేరుగా కొత్తగూడెం సర్వజనాసుపత్రికి వెళ్లినా సిబ్బంది సకాలంలో రిపోర్టులు ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు.

# పదేళ్ల కల.. సాకారం దిశగా..!



కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా వెళ్తున్న కొన్ని జాతీయ రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో కొత్తగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, వంతెన నిర్మాణాలకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రణాళికలు రూపొందించింది. మొత్తమ్మీద 15 ఎన్‌హెచ్ పనులు చేపట్టనుంది. వీటిలో ఎన్‌హెచ్–30, 365, 563ను నాలుగు వరుసల రహదారులుగా మార్చటంతో పాటు కొత్తగూడెం– పాల్వంచ బైపాస్ నిర్మాణానికి ఇందులో చోటిచ్చింది. రాబోయే మూడేళ్లలో ఈ పనులను పూర్తిచేసేలా ఎన్‌హెచ్ఏఐ అధికారులు జాగ్రత్తలు తీసుకోనున్నారు.

**ఎట్టకేలకు మోక్షం..**

కొత్తగూడెం–పాల్వంచ నడుమ పదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన బైపాస్ నిర్మాణానికి మోక్షం లభించింది. ఎన్‌హెచ్–30లో భాగంగా రుద్రంపూర్–భద్రాచలం సెక్షన్ మధ్య నాలుగు వరుసల రహదారితో పాటు కొత్తగూడెం–పాల్వంచ బైపాస్ నిర్మాణానికి కేంద్రం ప్రణాళిక రూపొందించింది. భద్రాచలం వైపు రాకపోకలు సాగించే భారీ వాహనాలు, బొగ్గు లారీలను కొత్తగూడెం మీదుగా కాకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించేందుకు 2008లో బైపాస్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. రూ. 33కోట్లతో 2014లో పనులు ప్రారంభించారు. పాల్వంచలోని నవభారత్ నుంచి కొత్తగూడెం కార్పొరేషన్ పరిధి గంగాహుస్సేన్ బస్తీలోని పంట పొలాల వరకు రోడ్డు నిర్మించారు. ఆ తరువాత ఆపేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 'బైపాస్' నిర్మాణం పట్టాలెక్కనుంది.

**మరోసారి నిరాశే..**

హైదరాబాద్ రింగ్‌రోడ్డు నుంచి వలిగొండ, తొర్రూరు, నెల్లికుదురు, మహబూబాబాద్, బయ్యారం, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారి 930పీ నిర్మించాలి. ఇందులో భాగంగా రూ. 700కోట్లతో కొత్తగూడెం–ఇల్లెందు మధ్య 44కి.మీ. రహదారి నిర్మాణం చేపట్టాలి. భూసేకరణ, అటవీ అనుమతులు లేక పనులు మొదలవటం లేదు. భారీ వాహనాల రాకపోకలతో రహదారి దెబ్బతినటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా.. ఆచరణకు నోచుకోవటం లేదు. కేంద్రం తాజాగా గుర్తించిన జాతీయ రహదారుల్లో 930(పీ)కి చోటు కల్పించకపోవటంతో మరోసారి నిరాశే మిగిలింది.

**ఇక ప్రయాణం సాఫీగా..** ఖమ్మం నుంచి సత్తుపల్లి, వరంగల్ మధ్య ప్రయాణం సాఫీగా సాగనుంది. ఎన్‌హెచ్–365బీబీలో భాగమైన ఖమ్మం, కొణిజర్ల, వైరా, తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి రోడ్డు, ఎన్‌హెచ్–563లో భాగంగా ఖమ్మం–వరంగల్ మధ్య నాలుగు వరుసల రహదారుల నిర్మాణానికి సర్కారు పచ్చజెండా ఊపింది. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, ఇరుకు రోడ్ల వల్ల చోటుచేసుకుంటున్న ప్రమాదాలను నివారించటానికి రహదారులను విస్తరించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వీటిని నాలుగు వరుసలుగా మార్చేందుకు మార్గం సుగమమైంది. హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో ఆర్అండ్‌బీ రహదారుల ఉన్నతీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కసరత్తు ప్రారంభించింది. ఇందులో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ప్రధాన రహదారులకు స్థానం కల్పించింది.

# 'ఈ–వ్యర్థం..'అనర్థం

హైదరాబాద్: మహానగరానికి ఎలక్ట్రానిక్ వ్యర్థాల ముప్పు పెరుగుతోంది. ఏటా వ్యర్థాలు పోగుపడుతుంటే రీసైక్లింగ్‌లో సరైన విధానాలు అవలంబించక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాడి పారేస్తున్న సెల్‌ఫోన్లు, టీవీలు, విద్యుత్తు పరికరాలు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడంలో పీసీబీ, మున్సిపల్, ఇతర విభాగాల అలసత్వం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో కాలుష్యం పెరిగిపోతోంది. పారేసిన బ్యాటరీ ఓ జలాశయాన్ని కలుషితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**సింహభాగం నగరం నుంచే..**

ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోంది. తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా తర్వాత దేశంలో మూడో అతిపెద్ద వ్యర్థాల ఉత్పత్తిదారుగా రాష్ట్రం నిలిచిందని లోక్‌సభలో పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం నాటికి 1.19లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వెల్లడించింది. ఈ వ్యర్థాలన్నీ ఐటీ



రంగానికి కేంద్రంగా ఉన్న రాజధాని నుంచే ఉత్పత్తి అవుతున్నాయి.

**20శాతంలోపే..**

వ్యర్థాల రీసైక్లింగ్ కోసం కాలుష్య నియంత్రణ మండలి 31 సంస్థలకు అనుమతులివ్వగా అందులో 20కి పైగా రాజధాని పరిధిలోనే ఉన్నాయి. వీటికి ఏటా 2.25 లక్షల టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే సామర్థ్యం ఉంది. అయినా 40వేల మెట్రిక్ టన్నులకు మించి రీసైక్లింగ్ చేయడం లేదు. పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2023–24లో ఎక్సటెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)లో భాగంగా 63,635 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో బంగారం, రాగి, అల్యూమినియం, ఇనుము, వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులుండగా ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్నులున్నాయని పేర్కొంది.

**కాలుష్యంతో సమస్యలిలా..**

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి విషపూరిత పదార్థాలుంటాయి. వీటిని రీసైకిల్ చేయకపోతే నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. సీసం నీటి వనరుల్లో కలిస్తే నీటి కాలుష్యానికి దారి తీయడంతో పాటు జలచరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయి. ఈ రసాయనాలు నేలలో చేరి దాని సారాన్ని దెబ్బతీస్తాయి. వీటిని కాల్చడం, అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయడం వల్ల డైఆక్సిన్‌లు, ఫ్యూరాన్లు వంటి విషపూరిత వాయువులు విడుదలై గాలిని కలుషితం చేస్తాయి. దీంతో క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీస్తాయి.

# చేయూతనిస్తే.. చేతివాటం చూపారు

హైదరాబాద్ : ప్రముఖ ప్రభుత్వ పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో వైద్య పరికరాలు, ధోబీఘాట్ యంత్రాల కొనుగోళ్లలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ అధికారి అంతా తానై వ్యవహరించి నిధులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. నిలోఫర్‌లో అదనపు భవనం, ముఖ్యమైన పరికరాల కొనుగోలు కోసం ఓ ప్రభుత్వ రంగ సంస్థ గతంలో సీఎస్ఆర్ కింద రూ. 20 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రస్తుతం ఓపీ భవనం పక్కన రూ. 10 కోట్లతో కొత్త భవనం నిర్మిస్తున్నారు. మరో రూ. 10 కోట్లతో వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతులకు వినియోగించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం టీజీఎంఐఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ పరికరాలను కొనుగోలు చేయాలి. ఇక్కడే సదరు అధికారి అత్యవసర పద్దు కింద ఈ నిధుల నుంచి పరికరాల కొనుగోలుకు శ్రీకారం చుట్టారు.

**నిబంధనలు తుంగలో తొక్కి**

తొలుత ఆసుపత్రిలోని ధోబీఘాట్‌లోని యంత్రాలను మార్చాలని నిర్ణయించి ఓ ప్రైవేటు సంస్థకు ఆ పనులను ఏకపక్షంగా అప్పగించినట్లు తెలుస్తోంది. గత సెప్టెంబరులో 60 కిలోలు, 100 కిలోల సామర్థ్యం



ఉన్న యంత్రాలను కొనుగోలు చేశారు. ఏవైనా యంత్రాలు డిస్పోజబుల్ చేసి కొత్తవి కొనాలంటే ఒక కమిటీ ఏర్పాటు చేయాలి. ఇక్కడ అదేమీ జరగలేదని తెలుస్తోంది. పాత యంత్రాలకు ఎలాంటి ధర లేకుండానే సదరు సంస్థకు అప్పగించినట్లు తెలుస్తోంది. పాత యంత్రాలు విక్రయించగా...వచ్చే నిధులు ఆసుపత్రి ఖాతాలో నమోదు కాలేదు. ఆడిట్‌లో ఈ విషయం తేలింది. ఇవే కాకుండా పలు పరికరాలను ఎలాంటి నిబంధనలు పాటించకుండా కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. సీఎస్ఆర్ కింద నిధులు ఇచ్చిన సంస్థనూ బురిడీ కొట్టించినట్లు తెలిసింది. అత్యవసరంగా పరికరాలు కొనుగోలు చేసినట్లు సదరు సంస్థకు బిల్లులు పంపిస్తూ... నిధులను ఆసుపత్రి అభివృద్ధి ఫండ్(హెచ్‌డీఎఫ్)కు బదిలీ చేయించినట్లు సమాచా రం. ఇలా మొత్తం రూ. 5–6 కోట్ల నిధులకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు చెబుతున్నారు. ఈ విషయమై ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ విజయకుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. ఈ అంశంపై తన వద్ద ఎలాంటి సమాచారం లేదని బదులిచ్చారు.




అమరావతి: ప్రభుత్వంపై సోషల్ మీడియాలో విష ప్రచారమే వైకాపా పనిగా పెట్టుకుందని హోంమంత్రి అనిత విమర్శించారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. వైకాపా వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ చేశారు. ఆధారాలు చూపలేకపోతే క్రిమినల్, సివిల్ చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన పార్టీ నిర్లక్ష్యంగా బురద జల్లడం దుష్ప్రవర్తనే అని దుయ్యబట్టారు. "ఆధారాలు లేకుండా నాయకులను కించపరచడం మంచిది కాదు. ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారాన్ని సహించేది లేదు. కల్పిత ఆరోపణలను ప్రచారం చేయడం వాక్ స్వాతంత్ర్యం కాదు. న్యాయమైన రాజకీయ చర్చను మేం స్వాగతిస్తాం. ఉద్దేశపూర్వక అబద్ధాలపై చట్టం పూర్తిస్థాయిలో కఠినంగా వ్యవహరిస్తుంది" అని అనిత హెచ్చరించారు.

## జగన్‌తో పాటు జైలుకెళ్లేందుకు సజ్జల సిద్ధంగా ఉండాలి: ఎమ్మెల్యే గోరంట్ల



మంగళగిరి: ప్రభుత్వాన్ని విమర్శించేందుకు సజ్జల రామకృష్ణారెడ్డికి ఏం అధికారం ఉందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ధైర్యం ఉంటే వైకాపా ఎమ్మెల్యేలతో మాట్లాడించాలన్నారు. మాజీ సీఎం జగన్‌తోపాటు జైలుకు వెళ్లేందుకు సజ్జల కూడా సిద్ధంగా ఉండాలన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో చాలా దోచుకున్నారని, రైతులకు ధాన్యం బకాయిలు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

వైకాపా నేతల విమర్శలకు తాము బెదిరిపోబోమని, వారు చేసిన దోపిడీలన్నీ బయటపెడతామని హెచ్చరించారు.

## తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ పర్యటన



గుంటూరు: గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెంలో మిస్టరీ మరణాలపై ఇప్పటికీ స్పష్టమైన కారణాలు తెలియలేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ అన్నారు. శుక్రవారం తురకపాలెంలో పర్యటించి అధికారులు, వైద్యులతో మాట్లాడారు. ప్రాథమికంగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో మెలోడియాసిస్ ఆనవాళ్లు లేవని పేర్కొన్నారు. రక్త నమునాలు సేకరించి చెన్నై ప్రయోగశాలకు పంపినట్లు వెల్లడించారు. ఫలితాలు ఇంకా రాలేదని.. కానీ తప్పకుండా ఏదో వైరస్ ఉందని మాత్రం భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్ బృందం తురకపాలెం వస్తోందన్నారు. వరుస మరణాల విషయంలో జిల్లా వైద్య అధికారులు సరిగా స్పందించలేదని, ఉన్నతాధికారులకు సకాలంలో సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వెలిబుచ్చారు.

ఐఏఎస్ అధికారి అధ్వర్యంలో విచారణ కమిటీ వేస్తున్నామని... తప్పని తేలితే డీఎమ్‌హెచ్‌వోపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తురకపాలెంలో త్వరలోనే సాధారణ పరిస్థితులు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రితో పాటు పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.



## విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే: మంత్రి డోలా

విశాఖపట్నం: అన్నింటి కంటే ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైందని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని చెప్పారు. విద్యా వ్యవస్థలో మంత్రి లోకేశ్ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని, రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా టీచర్ల బదిలీలు చేపట్టామని తెలిపారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఎంపీ భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కలెక్టర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు తేవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనూ మార్పులు రావాలని ఆకాంక్షించారు.




నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి పీవీ పార్వతీశ్వర గుప్తా హత్యకు గురయ్యారు. గత నెల 26న అదృశ్యమైన ఆయన.. శుక్రవారం ఉదయం విగతజీవిగా కనిపించారు. శ్రీకాకుళంలోని రామిగడ్డ కాల్వలో పార్వతీశ్వర గుప్తా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేటలోని లచ్చుమన్నపేట వీధికి చెందిన పార్వతీశ్వర గుప్తా గత నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ కనిపించలేదు. నరసన్నపేటలోని బంగారు దుకాణాలకు బంగారం బిస్కెట్లు సరఫరా చేసే గుప్తా.. తన కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి రాకపోవడంతో గత నెల 30న అతడి సోదరుడు మన్మథరావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. పార్వతీశ్వర గుప్తాను కారు డ్రైవర్ సంతోష్‌తో పాటు శ్రీకాకుళం పెదపాడు సమీపంలోని కార్ డెకార్స్ యజమాని హత్య చేసినట్లు నిర్ధరణకు వచ్చారు.

రెండు రోజులుగా శ్రీకాకుళం సమీపంలోని పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రామలక్ష్మణ కూడలి సమీపంలోని రామిగడ్డ కాల్వలో పార్వతీశ్వర గుప్తా మృతదేహాన్ని గుర్తించారు.




బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లాలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. నెల క్రితం ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు.. అందులోని డబ్బును తిరిగి తెచ్చి అక్కడే పెట్టి వెళ్లారు. బుక్కరాయసముద్రం చెరువుకట్ట వద్ద ఉన్న ముసలమ్మ ఆలయంలో ఈ ఘటన జరిగింది. చోరీ చేసిన నగదుతో పాటు ఓ లేఖను దొంగలు ఆలయం వద్ద ఉంచి వెళ్లారు. హుండీలో నగదు దొంగిలించడంతో తమ పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారని లేఖలో పేర్కొన్నారు. దొంగలు తిరిగి తెచ్చిన నగదును ఆలయ నిర్వాహకులు లెక్కించారు. మొత్తం నగదు రూ.1,86,486 ఉన్నట్లు వారు తెలిపారు. అమ్మవారి మహత్యం వల్లే దోచుకెళ్లిన నగదును దొంగలు తిరిగి తెచ్చిపెట్టారని ఆలయ నిర్వాహకులు చెప్పారు.




ముంబయికి బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో కలకలం రేగింది. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యారు. 34 వాహనాల్లో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని పేర్కొంటూ శుక్రవారం ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. "ముంబయిలోకి 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవబాంబులను ఏర్పాటు చేశాం. వారి వద్ద 400 కిలోల ఆర్డీఎక్స్ ఉంది. ఇప్పుడు మేము చేపడుతున్న భారీ పేలుళ్లు మొత్తం ముంబయి నగరాన్ని కుదిపేస్తాయి" అని మెయిల్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. 'లష్కర్ ఏ జిహాదీ' అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. తాను పాక్‌కు చెందిన జిహాదీ గ్రూప్ సభ్యుడిగా మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. నగరంలో భారీగా భద్రతా బలగాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయడానికి బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. సోదాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదన్నారు. నగరంలో అనుమానాస్పద కదలికలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ముంబయి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇదే విధంగా ఇటీవల పట్నాలోని సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు బిహార్‌లోకి చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో బిహార్ పోలీసు హెడ్ క్వార్టర్స్ రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ జారీ చేసింది. ఉగ్రవాదుల ఫొటోలు, వివరాలను విడుదల చేసింది. వీరు నేపాల్ మీదుగా బిహార్ చేరుకున్నట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు.




## గురువుల పట్ల నీతి బాహ్యమైన చర్యలు.. వైకాపా మరో మెట్టు దిగజారింది: మంత్రి లోకేశ్

అమరావతి: టీచర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వైకాపా చర్యల్ని మంత్రి నారా లోకేశ్ ఖండించారు. ఫేక్ హ్యాండిల్స్ ద్వారా ఫేక్ విషయాలను ప్రచారం చేస్తున్న ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. వైకాపా తన ఫేక్ హ్యాండిల్‌లో ఒక ఫొటోను షేర్ చేసిందని పేర్కొన్నారు. వేరే రాష్ట్రంలో ఆ ఘటన జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న టీచర్లు మద్యం తాగి బెంచీల కింద పడుకుంటున్నారన్న రీతిలో అతి జుగుప్సాకరంగా అందులో వ్యాఖ్యానం ఉందన్నారు. ఇది చాలా బాధాకరమని తెలిపారు. "ఏ రాష్ట్రంలోనో వచ్చిన ఫొటోను ఏపీలో జరిగినట్లు చెప్పడం క్షమించరాని నేరం. గురువుల పట్ల కూడా నీతిబాహ్యమైన చర్యలతో వైకాపా మరో మెట్టు కిందికి దిగజారింది. ఇలాంటి నేరాలను ఇప్పటికే వాళ్లు చాలా చేశారు. ఆ పార్టీ చర్యల్ని అర్థం చేసుకుని తగిన రీతిలో స్పందించాల్సిందిగా టీచర్లను కోరుతున్నాను" అని లోకేశ్ అన్నారు.

## గత ప్రభుత్వం టీచర్లను వైన్ షాపులకు కాపలా పెట్టి అవమానించింది: మంత్రి డీబీవీ స్వామి



అమరావతి: విద్యార్థులకు విద్యాబుద్ధులు, నైతిక విలువలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివన్నారు. సమాజం మొత్తం చేతులెత్తి నమస్కరించే ఉపాధ్యాయులను.. గతంలో వైకాపా ప్రభుత్వం వైన్ షాపుల దగ్గర కాపలా పెట్టి అవమానించిందని విమర్శించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని చెప్పారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## మధ్యవర్తిత్వంతో చాలా కేసులు పరిష్కారం: హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



విశాఖ: కేసులకు తగినంతగా న్యాయమూర్తులు ఉండటం అవసరమని ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. విశాఖలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. న్యాయమూర్తుల సంఖ్య పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

చాలా కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం అవుతాయని చెప్పారు. ప్రత్యామ్నాయాలతోనే సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. న్యాయమూర్తులకూ మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరమన్నారు. అందులోనూ మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ధరల్లోనే వినోదం: మంత్రి కందుల దుర్గేశ్



అమరావతి: దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. జీఎస్టీ శ్లాబుల సరళీకరణ.. పర్యాటక, సినిమా రంగాలకు ఊతమందిస్తుందని తెలిపారు. ఈ సంస్కరణలతో తక్కువ ధరల్లోనే వినోదం లభించనుందని వివరించారు.

బడ్జెట్ ట్రావెలర్, దేశీయ టూరిజానికి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. "18 శాతం శ్లాబ్ పరిధిలోకి సినిమా ప్రొడక్షన్ సేవలు తేవడం ద్వారా నిర్మాతలకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. పన్నులు తగ్గితే సినిమా, పర్యాటక రంగాల్లో ఉపాధి పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. హోటల్ రూమ్ టారిఫ్‌లు 7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 5 శాతానికి తగ్గించారు. రెస్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 5 శాతానికి తగ్గించారు. వస్తు సేవల పన్నులో సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు" అని కందుల దుర్గేశ్ తెలిపారు.

## సారీ అమ్మా అంటూ నిహారిక పోస్ట్.. నెట్టింట వైరల్

పిల్లలు ఎంత పెద్ద వాళ్లైనా తల్లిదండ్రులకు మాత్రం ఎప్పటికీ చిన్న పిల్లలే. అందుకే వారు ఎప్పుడు బయటికెళ్తున్నా వారికి జాగ్రత్తలు చెప్పడంతో పాటూ తిరిగి ఇంటికి వచ్చి వారి కళ్ల ముందు కనిపించే వరకు దేవుడిని ప్రార్థిస్తూనే ఉంటారు. సెలబ్రిటీలు సైతం ఇందుకు అతీతులు కాదు. ఇదే విషయాన్ని రీసెంట్ గా మెగా డాటర్ నిహారిక తన సోషల్ మీడియాలో తెలిపారు. తెలుగు ఆడియన్స్ కు నిహారిక గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు.

ఓ వైపు నటిగా సినిమాలు చేస్తూనే, మరోవైపు నిర్మాతగా కూడా సినిమాలను నిర్మిస్తూ బిజీగా ఉంటున్నారు నిహారిక. అయితే సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ నిహారిక తన ఫ్రెండ్స్ తో లైఫ్ ను ఎంజాయ్ చేస్తూ వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటారు.



**వీడియోతో వైరల్ అయిన నిహారిక...** సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్డేట్స్ ను అందిస్తూ ఫ్యాన్స్ కు టచ్ లో ఉండే నిహారిక తాజాగా చేసిన ఓ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. నిహారిక తన ఇన్‌స్టాలో ఓ వీడియోను పోస్ట్ చేస్తూ దానికి సారీ అమ్మా! అంటూ క్యాప్షన్ ను యాడ్ చేశారు. ఆ వీడియోలో ఎత్తైన వాటర్‌ఫాల్ వద్ద పెద్ద ఎత్తున నీటి ప్రవాహంతో పాటూ విపరీతమైన గాలితో ప్రమాదకరమైన వాతావరణంలో నిహారిక ఎంజాయ్ చేస్తూ కనిపించారు. నిహారిక చేసిన పోస్ట్ కు తన వదిన లావణ్య త్రిపాఠి నవ్వుతున్న ఎమోజీ పెట్టి కామెంట్ చేయగా ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

ఈ వీడియోను చూసిన నెటిజన్లు మాత్రం నిహారికకు జాగ్రత్తలు చెప్తూ అమ్మ చెప్పినట్టు మీరు క్షేమంగా రావాలని కోరుకుంటున్నామని కామెంట్స్ చేస్తున్నరు. కమిటీ కుర్రోళ్లు సినిమాతో నిర్మాతగా మంచి సక్సెస్ ను అందుకున్న నిహారిక ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా నెక్ట్స్ మూవీ షూటింగ్ ను కూడా స్టార్ట్ చేశారు.

## భూ వివాదంలో చిక్కుకున్న ఖాన్ డాటర్

కింగ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ ప్రస్తుతం వరుస చిత్రాల్లో నటిస్తూ, బిగ్ కెరీర్‌ని నిర్మించుకుంటున్న సంగతి తెలిసిందే. 'ది ఆర్చీస్' వెబ్ సిరీస్ తర్వాత, తన తండ్రి షారూఖ్ తో కలిసి కింగ్ అనే భారీ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. సిద్ధార్థ్ ఆనంద్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇంకా ఒక్క సినిమా అయినా రిలీజ్ కాక ముందే ఖాన్ వారసురాలి క్రేజ్ చుక్కల్ని తాకుతోంది. మరోవైపు సుహానా ఒక లీగల్ ట్రబుల్‌ని ఎదుర్కోవడం ఉత్కంఠను కలిగిస్తోంది. ఇప్పుడు సుహానా ఊహించని విధంగా ఒక భూమి విషయమై చట్టపరమైన వివాదాల్లో చిక్కుకుపోయింది. అలీబాగ్‌లోని థాల్ గ్రామంలో వ్యవసాయ భూమి ఒప్పందం కారణంగా షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ చట్టపరమైన ఇబ్బందుల్లో పడింది. తాజా మీడియా కథనాల ప్రకారం..ప్రభుత్వం రైతులకు కేటాయించిన భూమిని సరైన అనుమతులు, కాగితపు పత్రాలు సేకరించకుండా సుహానా ఖాన్



కొనుగోలు చేసింది. దీనిని ప్రభుత్వం వ్యవసాయ అవసరాల కోసం రైతులకు ఇచ్చిన విషయాన్ని పరిగణించలేదు.

ఈ వ్యవసాయ భూమి విలువ రూ. 12.91 కోట్లు ఉంటుందని అంచనా. దీనిని ముంబైలోని కఫే పరేడ్‌లో నివసించే ఖోటే కుటుంబం నుండి సుహానా ఖాన్ కొనుగోలు చేసింది. షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా రిజిస్ట్రేషన్ సమయంలో రూ. 77.47 లక్షల స్టాంప్ డ్యూటీని చెల్లించింది. 30 మే 2023న డబ్బు బదిలీ స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ద్వారా జరిగింది. దర్యాప్తు సమయంలో అలీబాగ్ తహసీల్దార్ నుండి నివేదికను కూడా కోరారు. రెసిడెంట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఈ ఉత్తర్వును జారీ చేశారు. ఈ వివాదంపై మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.





## ఓజీ రేంజ్ మామూలుగా లేదుగా.. అక్కడ 35 వేలకు పైగా టికెట్స్ బుక్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజాగా నటిస్తున్న చిత్రం ఓజీ. ప్రముఖ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ తో డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్నో అంచనాల మధ్య సెప్టెంబర్ 25వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో.. ఇమ్రాన్ హస్మి , శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఇమ్రాన్ హస్మీ ను విలన్ గా ఇంట్రడ్యూస్ చేస్తూ రిలీజ్ చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. "డియర్ ఓజీ.. నిన్ను కలవాలని.. చూడాలని.. చంపాలని.. ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను.. హ్యాపీ బర్తడే ఓజీ.. నీ ఓమీ " అంటూ విడుదలైన ఈ గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. యాక్షన్, మాస్ పెర్ఫార్మన్స్ తో తెరకెక్కబోతున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ కి డిప్యూటీ సీఎంగా మారిన తర్వాత ఆయన నుంచి రాబోతున్న రెండవ చిత్రం కావడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు ఈ సినిమాకి అక్కడ భారీ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే 35 వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోయి సంచలనం సృష్టిస్తోంది ఓజీ. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఈ సినిమా యూఎస్ మార్కెట్లో దంచి కొడుతోంది అని అక్కడ లేటెస్ట్ రికార్డ్స్ బుకింగ్ చెబుతున్నాయి.. అలా ఇప్పటివరకు 35 వేలకు పైగా టికెట్స్ అమ్ముడుపోయినట్లు సమాచారం. మొత్తానికైతే ఓజీ హవా ఓవర్సీస్ లో గట్టిగానే ఉందని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా.. మరొకవైపు సుజీత్ సౌత్ ను మొదలుకొని నార్త్లో కూడా తన మార్కెట్ ను పెంచుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే మాస్ యూత్ కి కనెక్ట్ అయ్యేలా యాక్షన్ ఓరియంటెడ్ డ్రామాగా ఈ సినిమాని రూపొందించినట్లు ఇటీవల విడుదలైన గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది. ఇక త్వరలోనే ఈ సినిమా ట్రైలర్ ని కూడా రిలీజ్ చేసి సినిమాపై మరింత అంచనాలు పెంచబోతున్నారు డైరెక్టర్. మరి ఈ సినిమా విడుదల తర్వాత ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి. పవన్ కళ్యాణ్ తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఓజీ సినిమా షూటింగ్ తో పాటు మరొకవైపు తనకు గబ్బర్ సింగ్ లాంటి సూపర్ హిట్ సక్సెస్ అందించి.. కెరియర్ ను ప్రసాదించిన డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నారు. అదే ఉస్తాద్ భగత్ సింగ్. ఇందులో ప్రముఖ యంగ్ బ్యూటీ శ్రీలీలా హీరోయిన్ గా నటిస్తోంది. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది ఈ సినిమాను రిలీజ్ చేయబోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలో ఒక పవర్ఫుల్ స్పెషల్ నెంబర్ ఉండబోతుందని.. ఈ పాట షూటింగు శనివారం రోజు ప్రారంభం కాబోతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా పవన్ కళ్యాణ్ మాస్ ఎనర్జిటిక్ పెర్ఫార్మన్స్ తో ఆడియన్స్ ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలుస్తోంది.

## సల్మాన్- కమల్ హాసన్ కాంబో మూవీ పాజిబులేనా?





కొన్ని కాంబినేషన్లు అరుదుగా మాత్రమే సాధ్యపడతాయి. అలాంటి ఒక కాంబినేషన్ ని సెట్ చేసేందుకు స్టార్ డైరెక్టర్ అట్లీ ప్రయత్నించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, దక్షిణాదికి చెందిన లెజెండరీ నటుడు కమల్ హాసన్ కాంబినేషన్‌లో అత్యంత భారీ మల్టీస్టారర్ ని తెరకెక్కించేందుకు అట్లీ సన్నాహకాల్లో ఉన్నాడని 2024 ఆరంభంలో కథనాలొచ్చాయి. జవాన్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత అతడు ఇద్దరు అగ్ర తారల్ని కలిపి సినిమా చేసేందుకు ప్రయత్నించినా అది సాధ్యపడలేదు. అన్నీ కుదిరితే ఈ ఏడాది జనవరిలో సినిమా ప్రారంభమయ్యేది. ఈ మల్టీస్టారర్ సినిమాలో సౌత్- నార్త్ నుంచి పేరున్న అగ్ర తారలు నటిస్తారని కథనాలొచ్చాయి. అక్టోబర్ లో ప్రీప్రొడక్షన్ ప్రారంభమవుందని కూడా గుసగుసలు వినిపించాయి. పక్కా మాస్ యాక్షన్ కమర్షియల్ చిత్రాలతో రాణిస్తున్న అట్లీ ఇద్దరు ప్రముఖ స్టార్లతో ఎలాంటి ప్రయోగం చేయబోతున్నాడో తెలుసుకోవాలని ఫ్యాన్స్ వేచి చూసారు. కమల్ హాసన్ లాంటి విలక్షణ హీరోతో భారీ మాస్ యాక్షన్ స్టార్ సల్మాన్ ని కలిపి సినిమా తీయాలనే ఆలోచనే క్రేజీగా ఉంది. కానీ ఎక్కడ పొరపాటు జరిగిందో అట్లీ ఈ కాంబినేషన్ ని వర్కవుట్ చేయడంలో విఫలమయ్యాడు. ఇంతలోనే యువహీరో వరుణ్ ధావన్ తో బేబి జాన్ పూర్తి చేసి, తన తదుపరి ప్రాజెక్ట్ ని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో ప్రకటించాడు అట్లీ. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతోంది. సైన్స్ ఫిక్షన్ కథను ఎంపిక చేసుకుని, అల్లు అర్జున్ లాంటి మాస్ యాక్షన్ హీరోతో అట్లీ భారీ ప్రయోగం చేస్తున్నాడు. మరోవైపు సల్మాన్ ఖాన్ సికందర్ తర్వాత గాల్వాన్ లోయ – చైనా బార్డర్ నేపథ్యంలో సినిమా చేయాల్సి ఉన్నా, అది వాయిదా పడిందని కథనాలొచ్చాయి. లెజెండరీ కమల్ హాసన్ తదుపరి నాగ్ అశ్విన్ కల్కి 2898 ఏడి- సీక్వెల్ లో నటించాల్సి ఉంది. సల్మాన్ – కమల్ హాసన్ ప్రాజెక్ట్ అంటే అది కచ్చితంగా మోస్ట్ అవైటెడ్ సినిమాల జాబితాలో ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఇది భవిష్యత్ లో సెట్స్ పైకి వెళుతుందా? అల్లు అర్జున్‌తో ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత అయినా అట్లీ దీనిని సెట్స్ పైకి తీసుకెళ్లగలడా లేదా? అన్నది వేచి చూడాలి.

## మళ్లీ వివాదంలో మృణాల్.. ఎందుకు ఈ విరోధం?

ఇటీవల రకరకాల కారణాలతో మృణాల్ ఠాకూర్ పేరు నిరంతరం మీడియా హెడ్ లైన్స్‌లోకొస్తోంది. ప్రముఖ కోలీవుడ్ నటుడు ధనుష్ తో మృణాల్ ప్రేమలో ఉందని నెటిజనులు ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ పుకార్లను మృణాల్ ఖండించనూ లేదు ఔనని అనలేదు. ఇదిలా ఉండగానే, ఇప్పుడు మృణాల్ ఓ కొత్త వివాదంలో చిక్కుకుంది. ఈసారి బాలీవుడ్ లో ప్రముఖ కథానాయికను ఉద్దేశించి పేరు ప్రస్థావించకుండానే మృణాల్ చేసిన ఓ కామెంట్ హాట్ టాపిగ్గా మారింది. గతంలో ఓ స్టార్ హీరో సినిమాలో అవకాశం వస్తే నిరాకరించాను. ఆ సినిమాలో నటించిన కథానాయిక స్టార్ డమ్ సంపాదించినా కానీ, ఇప్పుడు సినిమాలు చేయడం లేదు! అని కామెంట్ చేసింది. అయితే సుల్తాన్ చిత్రంలో సల్మాన్ సరసన నటించిన అనుష్క శర్మ గురించే ఈ కామెంట్ చేసిందంటూ నెటిజనులు గెస్ చేస్తున్నారు.



అనుష్క శర్మను మృణాల్ టార్గెట్ చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే అనుష్కశర్మతో మృణాల్ పోలికేమిటో అర్థం కావడం లేదని నెటిజనులు విమర్శించడం కొసమెరుపు. అనుష్క శర్మ బాలీవుడ్ లో అగ్ర కథానాయికగా కొనసాగుతుండగానే పెళ్లి, పిల్లలు అంటూ లైఫ్ లో సెటిలైంది. ప్రస్తుతం తన వారసుల ఆలనాపాలనా చూడటం, కుటుంబ జీవనానికి ప్రాధాన్యతనిస్తోంది. స్టార్ డమ్ కంటే వ్యక్తిగత జీవితాన్ని అనుష్క శర్మ ప్రేమిస్తోంది. పైగా ఆధ్యాత్మిక పంథాలో గొప్ప సాంప్రదాయాన్ని అనుసరించే అనుష్క శర్మపై మృణాల్ కామెంట్లు చేయడాన్ని చాలా మంది నెటిజనులు తప్పు పడుతున్నారు.

మృణాల్ ప్రస్తుతం అల్లు అర్జున్ – అట్లీ కాంబినేషన్ చిత్రంతోపాటు, అడివి శేష్ డెకాయిట్ లోను నటిస్తోంది. మరో రెండు హిందీ చిత్రాల్లోను నటిస్తూ బిజీగా ఉంది. సినిమాల్లో నటించకపోయినా అనుష్క శర్మ క్రేజ్ అభిమానుల్లో ఏమాత్రం తగ్గలేదన్నది ఈ భామ గుర్తించాలని నెటిజనులు సూచిస్తున్నారు.

## వరుస భారీ ప్రాజెక్ట్ లు.. హిట్టైతే పాన్‌ఇండియా హీరోయినే

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి ఏస్ సినిమాతో కోలీవుడ్ లోకి అడుగుపెట్టింది హీరోయిన్ రుక్మిణి వసంత్. సప్తసాగరాలు దాటి సినిమాతో ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఇప్పుడు శివకార్తికేయన్ మధరాసి సినిమాతో మళ్లీ తమిళ సినిమా ఇండస్ట్రీలోకి తిరిగి వస్తోంది. ఈ సినిమా సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. మధరాసి సినిమాతో పాటు అక్టోబర్ 2న కన్నడ స్టార్ రిషభ్ శెట్టి కాంతారా చాప్టర్ 1 ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈసినిమాలోనూ రుక్మిణీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇలా రెండు భారీ సినిమాల్లో నటించడంతో దేశవ్యాప్తంగా ఆమెకు ఈ భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు వస్తున్నాయి. సప్త సాగరదాటి సినిమా తర్వాక రుక్మిణీ నెమ్మదిగా పాన్ ఇండియన్ స్టార్ గా దేశవ్యాప్తంగా



ముద్ర వేస్తోంది. మధరాసి, కాంతారా: చాప్టర్ 1తో పాటు, కేజీఎఫ్ స్టార్ యష్ టాక్సిక్, జూనియర్ ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ ల డ్రాగన్ వంటి భారీ సినిమాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇలాంటి భారీ అంచనాలు ఉన్న ఈ రెండు సినిమాలు పాన్‌ఇండియా రేంజ్ లో హిట్టైతే.. రుక్మిణి ఇండియాలోనే బడా స్టార్ గా ఎదిగిపోవడం ఖాయం. ఇవి ప్రస్తుతం భారతీయ సినిమాలో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్ లలో ఒకరిగా మారే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇప్పటివరకు తమిళంలో ఒకే సినిమాలో మాత్రమే నటించినప్పటికీ, రుక్మిణి తన స్క్రీన్ ప్రెజెన్స్, ఆకర్షణీయమైన లుక్స్ తో తమిళ ప్రేక్షకులలో ఇప్పటికే భారీ స్థాయిలో అభిమానులను ఏర్పరచుకుంది.

ఇక రాబోయే సినిమాలు బాగా ఆడితే, ఆమె త్వరలోనే పాన్‌ఇండియా హీరోయిన్ గా ఎలైట్ లిస్ట్ లో చేరుతుంది. ఇప్పటికైతే, అందరి దృష్టి మధరాసి సినిమాపై ఉంది. ఇది కొన్ని రోజుల్లో థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రం ఆమె కెరీర్ లో కీలకం అవుతుంది. ఆమె జాతీయ స్థాయి స్టార్ డమ్ కు టోన్ సెట్ చేసే బ్లాక్‌బస్టర్‌గా మారుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఉన్నారు.




హైదరాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి సీఎం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "71 ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణేశుడిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించింది. దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందింది. ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈరోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను కొనసాగిస్తోంది. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నాం. ఉత్సవాలను విజయవంతంగా ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.




## ఏడు కాదు.. మూడు యుద్ధాలే ఆపా.. మళ్లీ మాట మార్చేసిన ట్రంప్

తనని తాను శాంతి దూతగా పేర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇన్నాళ్లూ తాను ఏడు యుద్ధాలను ఆపానంటూ ప్రచారం చేసుకున్నారు. ఈ విషయంలో తాజాగా మాట మార్చేశారు. స్వయంగా మూడు యుద్ధాలు ఆపానని పేర్కొన్నారు. అమెరికాలోని ప్రముఖ టెక్ సంస్థల అధిపతులు, సీఈవోలకు ట్రంప్, ఆయన సతీమణి మెలానియా వైట్‌హౌస్‌లో విందు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై ఓ విలేకరి ప్రశ్నించారు. దీనికి ఆయన బదులిస్తూ.. 'మీకు తెలుసా.. నేను ఇప్పటి వరకు మూడు యుద్ధాలు ఆపా' అని పేర్కొన్నారు.

ఆయన ఏ యుద్ధాల గురించి చెప్పారో స్పష్టంగా వెల్లడించలేదు. అయితే, ఆ దేశాలన్నీ మూడు దశాబ్దాలుగా సంఘర్షణల్లో ఉన్నాయన్నారు. ఆ యుద్ధాలు మీరు ఆపలేరని.. తనకు ప్రజలు చాలా సార్లు చెప్పారన్నారు. కానీ, వాటన్నింటినీ తాను ఆపగలిగానని పేర్కొన్నారు. రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రస్తుతం క్లిష్టతరంగా ఉందని, అయినా తాను దాన్ని ఆపుతానని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల పలు సందర్భాల్లో భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తానే ఆపానంటూ ట్రంప్ పదే పదే పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే, భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది.

భారత్- పాక్‌ల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో దేశ ప్రమేయం లేదని ప్రధాని మోదీ కూడా స్పష్టం చేశారు. ఇక, థాయ్‌లాండ్ -కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఇజ్రాయెల్-హమాస్, రవాండా-డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియాల మధ్య ఘర్షణలను ట్రంప్ ఆపారని శ్వేతసౌధం పలుమార్లు పేర్కొంది. ఈ క్రమంలో ఆయన పేరును కొందరు నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేశారు.




## మహిళా ఐపీఎస్‌తో వాగ్వాదం.. స్పందించిన అజిత్ పవార్

ముంబయి: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ మధ్య జరిగిన వాగ్వాదం నెట్టింట వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా అజిత్ పవార్ స్పందించారు. చట్టపరమైన విషయాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తనకు లేదని తెలిపారు. కేవలం అక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకే ఆమెకు ఫోన్ చేసినట్లు తెలిపారు. అసలేం జరిగిందంటే.. ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టిన ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణతో అజిత్ పవార్ ఫోన్‌లో మాట్లాడారు. ఆ చర్యలను వెంటనే ఆపాలని ఆమెను ఆదేశించారు. 'నీకు ఎంత ధైర్యం? ఉపముఖ్యమంత్రి ఫోన్ చేస్తే నమ్మవా? నన్నే వీడియో కాల్ చేయమంటావా?' అని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో ఆయనపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ వివాదంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "సోలాపుర్‌లో పోలీసు అధికారులతో నా సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్ అవడం నా దృష్టికి వచ్చింది. చట్టపరమైన విషయాల్లో జోక్యం చేసుకోవడం నా ఉద్దేశం కాదు. కేవలం అక్కడ పరిస్థితి మరింత తీవ్రంగా మారకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఫోన్‌లో మాట్లాడా. పోలీసు విభాగం, ముఖ్యంగా మహిళా అధికారులంటే నాకు చాలా గౌరవం ఉంది. చట్టానికి కట్టుబడి ఉంటా. ఇసుక, మైనింగ్ అక్రమ కార్యకలాపాలకు నేను ఎప్పటికీ వ్యతిరేకమే" అని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేలు కోరుకుంటే.. మళ్లీ రేవంత్‌రెడ్డే సీఎం: మహేశ్‌కుమార్ గౌడ్




హైదరాబాద్: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కార్యకర్తలను కూడా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సీఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. " వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్తాం. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళ్తున్నాం. క్రమశిక్షణ విషయంలోనూ ఎక్కడా రాజీపడటం లేదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి. సీబీఐలో కొంత లొసుగులు ఉన్నాయి. అది వాస్తవం" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## వినాయక నిమజ్జనం పోలీసులకు ఛాలెంజింగ్: ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్



హైదరాబాద్: వినాయక నిమజ్జనం పోలీసులకు ఛాలెంజింగ్ అని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ అన్నారు. నిమజ్జనం ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ చాలా కీలకమని, అందుకే నెల ముందు నుంచే ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆర్‌అండ్‌బీ, సమాచారశాఖ, జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, రవాణా, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. "శనివారం ఉదయం 6గంటలకు ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం ప్రారంభమై.. మధ్యాహ్నం 2గంటలకు పూర్తయ్యే అవకాశముంది. నిమజ్జన కార్యక్రమంలో సుమారు 10లక్షల మంది పాల్గొంటారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. 3,200 మంది ట్రాఫిక్ పోలీసులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. నిమజ్జనంలో పాల్గొనే భక్తులు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించుకోవాలి" అని సీపీ తెలిపారు.

## గణేష్ ఉత్సవాల్లో రాజకీయ రగడ.. మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకున్న బీజేపీ నేతలు



నల్లగొండ : నల్లగొండ పాతబస్తీ ఒకటో నంబర్ వినాయకుడి వద్ద ఇవాళ(శుక్రవారం) తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రసంగిస్తుండగా బీజేపీ నేతలు అడ్డుకున్నారు. గణేష్ ఉత్సవాల్లో రాజకీయాలు మాట్లాడటమేంటని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కి వర్షిత్ రెడ్డిని తరలిస్తుండగా పోలీసులను బీజేపీ కార్యకర్తలు, నేతలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో వారిని అక్కడి నుంచి పోలీసులు పంపించి వేస్తున్నారు. అన్యాయంగా బీజేపీ నేతలను అరెస్ట్ చేస్తే చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేతలు ధ్వజమెత్తారు.




## గణేశ్ నిమజ్జనం.. అర్ధరాత్రి ఒంటి గంట వరకు మెట్రో సర్వీసులు

హైదరాబాద్: గణేశ్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో శుభవార్త చెప్పింది. అన్ని మెట్రో స్టేషన్ల నుంచి రేపు(శనివారం) ఉదయం 6 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. దీంతో నిమజ్జనాన్ని చూసేందుకు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మేలు కలగనుంది. గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత 20 రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేశామని హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వినాయక నిమజ్జనాలకు సంబంధించి చెరువులను అన్నింటినీ పరిశీలించినట్లు చెప్పారు. రేపటి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. "ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్, ఎన్టీఆర్ ఘాట్ వద్ద 40 క్రేన్లు ఏర్పాటు చేశాం. పోలీసుల సూచనలు మేరకు మండపాల నుంచి వెళ్లాలి. వాహనాలు, విగ్రహాలు ఎత్తు ఎక్కువగా ఉంటే పోలీసుల అనుమతితో నిమజ్జనానికి తీసుకెళ్లాలి. హైదరాబాద్‌లో ప్రతి ఏరియాపై మ్యాప్ వేసుకొని రూట్స్ డిసైడ్ చేశాం. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు అనుసరించాలి. రోడ్లపై డైవర్షన్ ఉన్న చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశాం. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం పూర్తి చేస్తాం. మండప నిర్వాహకులు తొందరగా బయలుదేరి రావాలి. 29 వేల మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నాం. శనివారం సుమారు 50వేల విగ్రహాల నిమజ్జనాలు జరుగుతాయి" అని సీవీ ఆనంద్ తెలిపారు.

**40లక్షల మంది భక్తులు పాల్గొంటారు: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి...** శనివారం హైదరాబాద్‌లో జరిగే గణేశ్ నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ తెలిపారు. 34 ప్రధాన చెరువులు, 64 ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 40లక్షల మంది భక్తులు పాల్గొని శోభాయాత్ర తిలకిస్తారని వెల్లడించారు. అన్న ప్రసాదాలు, తాగునీటి వసతి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. పోలీసుల సహకారంతో పని చేస్తామని తెలిపారు.

## యువతి ఫోటోలు మార్ఫింగ్.. రూ.10 లక్షలు డిమాండ్




హైదరాబాద్: ప్రపంచం ఆధునిక సాంకేతికతతో ముందుకు దూసుకెళ్తున్న తరుణంలో.. కొంతమంది దాన్ని ఉపాయోగించుకుని దారుణాలకు, అక్రమాలకు, అన్యాయాలకు ఒడిగడుతున్నారు. మంచి కోసం ఉపాయోగించాల్సిన సాంకేతికతను తమ స్వలాభం కోసం వినియోగిస్తూ.. దారుణాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా కొంత మంది, అమ్మాయిల ఫోటోలు మార్ఫింగ్ చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వడం కుదరదు అన్న వారికి ఎదురుతిరిగిన వాళ్ల ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ.. అమ్మాయిల మరణాలకు కారణం అవుతున్నారు. ఇలాంటి దారుణ ఘటనే.. అల్వాల్ పరిధిలో వెలుగు చూసింది.

**నిత్యపెళ్లి కొడుకు బాగోతం..** ఓ యువతి కారులో ట్రాకింగ్ డివైస్ పెట్టి, ఆమె ఆడియోను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడు ఓ నిత్యపెళ్లి కొడుకు. జిమ్‌లో పరిచయమైన యువతిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. గతంలో ప్రేమ పేరుతో ముగ్గురిని పెళ్లి చేసుకున్న నిత్య పెళ్లికొడుకు రవి అలియాస్ రఫీ అతడి సోదరుడు రూపేష్ యువతి ఆడియోలు, ఫోటోలు మార్ఫింగ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారు.

**రూ.10 లక్షలు ఇవ్వాలని బెదిరింపులు..** అయితే.. రూ.10 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేసినట్లు బాధిత యువతి తెలిపింది. వాళ్ల వేధింపులు తాళలేక రూపేష్, రవిపై అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. కొద్దిరోజుల క్రితమే.. రవిపై నిత్య పెళ్లికొడుకు ఆరోపణలు వచ్చినట్లు పోలీసులు చెప్పారు. యువతి ఫోటోలు, ఆడియోలు మార్ఫింగ్ చేసి వేధింపులకు గురిచేస్తున్నా.. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

**అసలు కథ..** అల్వాల్‌లో స్థానికంగా ఉంటున్న ఓ యువతి దగ్గరలో ఉన్న ఓ జిమ్‌కు రోజూ వెళుతుండేది. ఈ నేపథ్యంలో జిమ్‌లో రవి పరిచయం అయ్యాడు. ఆ తరువాత యువతితో రోజు మాట్లాడుతూ.. పరిచయం పెంచుకున్నాడు. ఆ తరువాత యువతి పోటోలు సేకరించి.. వాటిని మార్ఫింగ్ చేసి యువతిపై బెదిరింపులకు పాల్పడ్డాడు. అయితే.. మార్ఫింగ్ చేసిన ఆడియో, ఫోటోలను ఇప్పటికే సోషల్ మీడియాలో అప్లోడ్ చేసినట్లు బాధిత యువతి ఆవేదన వ్యక్తం చేస్తుంది. కాగా, గతంలో కూడా కట్నం కోసం పలు పెళ్లిళ్లు చేసుకుని, వారిని మోసం చేసినట్లు స్థానికంగా రవిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం అసాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలపై ఆమె మాట్లాడారు. సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకే జీఎస్టీ విధానంలో ఈ సవరణలు చేసినట్లు తెలిపారు. జాతీయ మీడియా సంస్థ 'ఇండియాటుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మలమ్మ ఈ వ్యాఖ్యలు చేశారు. "వన్ నేషన్- వన్ ట్యాక్స్ మంచి ఆలోచనే కానీ.. ఆచరణలో అది సాధ్యం కాదు. అభివృద్ధిలో వైవిధ్యాలు ఉన్నప్పుడు ఏకరూప జీఎస్టీ రేటును అమలు చేయడం అన్యాయమవుతుంది. మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను రేటు విధించగలమా? ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితంగా ఉంది. అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులను కట్టగలుగుతాయి. అభివృద్ధి చెందని రంగాలకు అది భారమవుతుంది. ఒకవేళ భారత్ అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందితే అప్పుడు ఒకే పన్ను విధానం సాధ్యమవుతుంది" అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక మంత్రి విమర్శలు గుప్పించారు. "ఒకప్పుడు జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అంటూ ఎగతాళి చేసిన వారే.. ఇప్పుడు పన్ను సంస్కరణలు చేయగానే క్రెడిట్ తీసుకునేందుకు ఆరాటపడుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 91శాతం వరకు ఆదాయపు పన్ను విధించిన రోజులు ఉన్నాయి" అని దుయ్యబట్టారు. జీఎస్టీలో సంస్కరణ వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్రానికి కూడా ఆదాయంలో కొంత కోత ఉంటుందని నిర్మలమ్మ తెలిపారు. తమ ప్రభుత్వానికి పౌరుల అవసరాలే ప్రథమ ప్రాధాన్యమని, ఆ తర్వాతే ఆదాయం గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని మరోసారి స్పష్టం చేశారు.




Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com